ప్రజాశక్తి

ఆదివారం 24 సెప్టెంబర్ 2023   8 పేజీలు

గుంటూరు   పల్నాడు

మిర్చి సాగుపైనే ఆశలు

వర్షాభావం నుంచి తాత్కాలిక ఉపశమనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో మెట్ట ప్రాంతంలో మిర్చిసాగుకు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. గత 15 రోజుల్లో విస్తారంగా వర్షాలు కురవడం వల్ల ఖరీఫ్ సీజన్ ముగింపు దశలో మిర్చిసాగుపైనే రైతులు దృష్టి సారించారు. ఉమ్మడి జిల్లాలో రెండు లక్షల ఎకరాల్లో మిర్చిసాగుకు అవకాశం ఉండగా ఈఏడాది ఇప్పటివరకు 80 వేల ఎకరాల్లోనే మిర్చిసాగు జరిగింది. జూన్‌నుంచి ఆగస్టు వరకు మెట్ట ప్రాంతంలో వర్షాలు ఆశాజనకంగా లేకపోవడంతో రైతులు మిర్చి సాగు చేయలేకపోయారు. ఈపరిస్థితుల్లో కృష్ణా పరివాహక ప్రాంతంలోకూడా విస్తారంగా వర్షాలు కురవడం వల్ల వచ్చేనెలలోసాగుకు వరద ప్రవాహం వస్తుందని ఆశిస్తున్నారు. అంతేగాకజిల్లాలో గత కొన్ని రోజులుగా వర్షాలు ఆశాజనకంగా ఉండటం వల్ల రైతులు మిర్చిసాగుకు పరిస్థితి సానుకూలంగాఉందని భావిస్తున్నారు. ప్రధానంగా పల్నాడు జిల్లాలో జూన్‌నుంచి ఆగస్టు వరకు కనీస వర్షపాతం నమోదు కాలేదు. సెప్టెంబరులో 134మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా ఇప్పటివరకు 151 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు అయింది. కొన్ని మండలాల్లో అవసరానికి మించి ఎక్కువగా వర్షపాతం నమోదు అయింది. మొదటి మూడు నెలలు కనీస వర్షపాతంకు నోచుకోని మాచర్ల,దుర్గి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి, మాచవరం, అచ్చంపేట, క్రోసూరు,పెదకూరపాడు మండలాల్లో ఈనెలలో అధిక వర్షపాతం నమోదు అయింది. నకరికల్లు,బెల్లంకొండ, సత్తెనపల్లి, నూజెండ్ల తదితర మండలాల్లో ఇప్పటికి కనీస వర్షపాతం నమోదు కాలేదు.మిగతా మండలాల్లో కనీస వర్షపాతం నమోదు అయింది. చివరి దశలో వర్షాలు కురిసినా నాగార్జున సాగర్ జలాశయంలో నీటి నిల్వ పెరగకపోవడం వల్ల వరిసాగుకు అవకాశం లేదు. అలాగే పత్తి సాగుకు కూడా సమయం పూర్తయింది. మిర్చిసాగుకు మరో పక్షం రోజులు సమయం ఉందని అధికార వర్గాలు తెలిపాయి. మరో వారం రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగియనుంది. రబీ పంటలుగా మినుము,పెసర, శనగ,జొన్న,మొక్కజొన్నసాగుకు మరికొంత మంది రైతులు ఉద్యుక్తుల వుతున్నారు. పల్నాడు జిల్లాలో ఖరీఫ్ సాగుఈ ఏడాది పూర్తి నిరాశజనకంగాఉంది. పల్నాడు జిల్లాలో 5.12 లక్షల ఎకరాల్లో పంటలుసాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు వరకు 2.22 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగింది. ఇంకా 2.90 లక్షల ఎకరాల భూమి ఖాళీగా ఉంది. గుంటూరు జిల్లాలో మొత్తం 3.25 లక్షల ఎకరాల భూమికి 2.35 లక్షల ఎకరాల్లోనే సాగు జరిగింది. దాదాపు 90 ఎకరాల్లో ఏపంటలు వేయలేదు. సాగర్ ఆయకట్టుపరిధిలో 1.25 లక్షల

2లో

ట్రావెల్స్ బస్సు ఢీకొని విద్యార్థిని దుర్మరణం

ప్రజాశక్తి - చిలకలూరిపేట

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు విద్యార్థులపై దూసుకువెళ్లగా ఒకరు మృతి చెందగా మరికొంత మంది గాయ పడిన ఘటన చిలకలూరి పేటలోని పురుషోత్త మపట్నం అడ్డరోడ్డు వద్ద శనివారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం ఉదయం 8 గంటల సమయంలో కోయంబత్తూరు నుంచి విజయవాడ వెళ్తున్న ట్రావెల్స్ బస్సు ఆర్‌విఆర్, నారాయణ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులను ఢీకొట్టింది. ఈ ఘటనలో స్థానిక కల్యాణి హోటల్ వెనుక, యూనియన్ బ్యాంక్ వద్ద, సుబ్బయ్య తోటకు చెందిన ఎస్.కె.వాజిత (18) దుర్మరణం పాలైంది. ఈ విద్యార్థిని తండ్రి అబ్దుల్ రషీద్ పాత స్పేర్ పార్ట్స్ బేరింగులు అమ్ముకుంటూ జీవనం కొనసాగిస్తుంటారని పోలీసులు తెలిపారు. ఈయనకు ఇద్దరు కుమార్తెలని చనిపోయిన విద్యార్థిని పెద్ద కుమార్తె అని తెలిపారు. ఈ విద్యార్థిని రోజు లాగానే తండ్రి తన మోటార్ సైకిల్ పై కోటప్ప కొండ వైపు నుంచి విద్యార్థులను తీసుకొచ్చే కాలేజి బస్సులో వెళ్లేందుకు అడ్డరోడ్డు వద్ద తన కుమార్తెను ఎక్కిస్తుంటారని శనివారం మోటారు సైకిల్ పై తీసుకెళ్లే క్రమంలో అడ్డరోడ్డు వద్ద యూ టర్న్ తీసుకునే సమయంలో మోటార్ సైకిల్‌ను వెనుక నుంచి ఈ బస్సు ఢీ కొట్టటంతో ఈ ప్రమాదం జరిగిందం టున్నారు. ఈ ప్రమాదంలో విద్యార్థి తండ్రికి కొద్దీ పాటి గాయాలు అయ్యా యన్నారు. ఈయనతో పాటు మరో ఇద్దరు విద్యార్థులకు గాయాలు అయ్యాయని వారిలో నారాయణ విద్య సంస్థల్లో ఇంటర్మీడి యట్ రెండో సంవత్సరం చదివే కృష్ణ అనే విద్యార్థికి తీవ్ర గాయాలు అయ్యాయాని ఈ విద్యార్థికి మెరుగైన వైద్యం కోసం గుంటూరు ఆసుపత్రిలో చేర్పించారన్నారు. వాజిత మరణ వార్త తెలుసుకుని సుబ్బయ్యతోటలో వారి ఇంటి ప్రాంత వసూలు విషాదంలో మునిగి పోయారు. బస్సును సీజ్ చేసి పట్టణ పోలీస్ స్టేషన్లో ఉంచామని ఆ బస్సు డ్రైవర్ ను అదుపుకో తీసుకున్నామని పోలీసులు తెలిపారు.

జిఎంసి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు

3వేల మంది కార్మికులకు వైద్య పరీక్షలు

2లో

సమావేశంలో మాట్లాడుతున్న పాశం రామారావు

విద్యుత్ ఛార్జీల పెంపుదలను, ఉద్యమాలపై నిర్బంధాన్ని నిరసిస్తూ

27న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

వామపక్షాల రౌండ్‌టేబుల్ సమావేశం పిలుపు

ప్రజాశక్తి-గుంటూరు

పెంచిన విద్యుత్ ఛార్జీలు, రాష్ట్రంలో పెరుగుతున్న నిర్బంధకాండకు నిరసనగా ఈనెల 27న ఉదయం 10గంటలకు వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. శనివారం బ్రాడీపేటలోని సిపియం కార్యాలయంలో జరిగిన వామపక్ష పార్టీల రౌండ్‌టేబుల్ సమావేశంలో సిపియం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, సిపిఐ జిల్లా కార్యదర్శి జంగాల ఆజయ్‌కుమార్, సిపిఐ (ఎమ్.ఎల్) లిబరేషన్ నాయకులు జి.సుబ్బారావు, సిపిఐ (యం.యల్) న్యూడెమోక్రసీ నాయకులు గనిరాజు, నరసింహరావు, సిపిఐ(యంయల్) రెడ్‌స్టార్ పొలిట్‌బ్యూరో సభ్యులు మన్నవ హరిప్రసాద్, ఎమ్.సిపిఐ (యు) నాయకులు శ్రీధర్ తదితరులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ట్రూఅప్‌ఛార్జీలు, ఇంధన సర్‌ఛార్జీల పేరుతో విద్యుత్ ఛార్జీల భారం మోపుతుందన్నారు. 2014 నుండి 2019 వరకు విద్యుత్ కొనగోళ్ళు, అమ్మకాలలో వచ్చిన రూ.2900కోట్ల నష్టాన్ని 36 నెలల పాటు విద్యుత్ బిల్లులో కలిపి వసూలు చేయడం దారుణమన్నారు. మరోవైపు వ్యవసాయ పంపుసెట్లకు మీటర్లు బిగిస్తూ రైతులపై భారాలు మోపుతుందన్నారు. ఈ విధానాలకు వ్యతిరేక ంగా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. పెంచిన విద్యుత్ ఛార్జీలు ఉపసంహరించకోకపోతే ఆందోళనను ఉదతం చేస్తామని హెచ్చరించారు. రాష్ట్రంలో ప్రజా ఉద్యమాలపై నిర్బందం కొనసాగుతుందని, రాజ్యాంగం కల్పించిన పౌరహక్కులకు విఘాతం కల్గిస్తుందన్నారు. ఇటీవల మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరెస్టు తీరును ఖండిస్తున్నామన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ఆందోళన చేస్తున్న ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వం నిర్భంధానికి కొనసాగిస్తుందన్నారు. భారత రాజ్యాంగం నిరసన తెలియచేసే హక్కు, ఆందోళన చేసే హక్కు పౌరులకు కల్పించబడినదని వీటిని ఉల్లంఘిస్తూ నిర్భంధాన్ని

2లో

ఉద్యోగులు సమయపాలన పాటించండి

సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశాలు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రిలో పని చేసే ప్రతి ఉద్యోగి సమయ పాలన ఖచ్చితంగా పాటించాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ ఆదేశించారు. శనివారం ఆయన మినిస్టరియల్ స్టాఫ్ గదులను పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఉదయం 10.30 గంటల నుంచి 10.45 మధ్య 15 మంది సమయానికి రాలేక పోయారని చెప్పారు. ఆసుపత్రిలో ప్రజలకు సిబ్బంది సమయానికి అందుబాటులో ఉండాలన్నారు. ఒకరిపై ఒకరు విమర్శలు చేసుకోవడం మానుకోవాలని, గతంలో ఏమి జరిగాయో అనవసరమన్నారు. ఈ విషయంలో ఎవరిని కామెంట్ చేయాల్సిన అవసరం లేదు. ప్రస్తుతం ఉన్న సిబ్బంది బాగా పని చేస్థారన్నా నమ్మకం ఉందని తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధి జరుగుతుందని, అందరి సహకారం అవసరమని చెప్పారు. నియమ నిబంధనల ప్రకారం పని చేస్తే ఎలాంటి సమస్యలు ఉండవని ఆయన చెప్పారు. ప్రభుత్వం నెల నెల జీతాలు చెల్లిస్తోంది. ప్రభుత్వానికి కూడా మంచి పేరు తీసుకుని వచ్చేందుకు కృషి చేద్దామని ఆయన సూచించారు. మంగళగిరి టి బి సెంటర్ నుంచి ఉద్యోగుల వివరాలను అందించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఎంతమంది పని చేస్తున్నారో వివరాలను అందించి సూపరింటెండెంట్ కార్యాలయం కు అటాచ్ మెంట్ చేయాలనీ ఆయన ఆదేశించారు.

గుంటూరులో ఫ్యాప్టో ఆధ్వర్యంలో ధర్నా

జిపిఎస్‌పై ఫ్యాప్టో నిరసన

చిలకలూరిపేటలో తహాశీల్దార్‌కు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

ప్రజాశక్తి-గుంటూరు

జిపిఎస్ విధానం బలవంతంగా అమలు చేస్తే ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని ఫ్యాప్టో చైర్మన్ ఎం.కళాధర్ హెచ్చరించారు. జిపిఎస్ విధానానికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా శనివారం గుంటూరు తాలూక వద్ద ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. పాత పెన్షన్ అమలు చేయాలని, సిపిఎస్, జిపిఎస్ ఒద్దని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఫ్యాప్టో నాయకులు జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ సిపిఎస్ రద్దు చేసి, ఓపిఎస్ అమలు చేస్తామన్న పాదయాత్ర హామీని విస్మరించి, ఇప్పుడు ఉద్యోగుల్ని మోసం చేస్తూ జిపిఎస్ తీసుకొస్తే అంగీకరించబోమని స్పష్టం చేశారు. కె.బసవలింగారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగుల అభిప్రా యాలను పట్టించుకోవట్లేదని, ఏకపక్షంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఫ్యాప్టో కోచైర్మన్ జి.వేళాంగిణిరాజు మాట్లాడుతూ సోమవారం కలెక్టరేట్ల వద్ద జరిగే ధర్నాలో ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం తహాశీల్దారు సాంబశివరావుకు వినతిపత్ర అందచేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో నాయకులు డి.పెదబాబు, బి.ఆదిలక్ష్మి, సుబ్బారెడ్డి, కె.నరసింహారావు, సిపిఎస్‌యుఎస్ నాయకులు తిరుమల రెడ్డి పాల్గొన్నారు.

చిలకలూరిపేట :పట్టణంలో ఫ్యాప్టో మరియు ఎపిసిపిఎస్‌ఇఎ సంయుక్త ఆధ్వర్యంలో జీపీఎస్ విరమించుకుని పాత పెన్షన్ విధానం కొనసాగించాలని కోరుతూ స్థానిక మండల తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పల్నాడు జిల్లా ఫ్యాప్టో చైర్మన్ బి. సంపత్ .

2లో

27న కలెక్టరేట్ వద్ద ధర్నా జయప్రదం చేయండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రయోగించడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ నేపద్యంలో కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో సిపియం నాయకులు కె.నళీనికాంత్, ఎమ్.ఎ.ఛిస్టీ, బ్కెరగాని శ్రీనివాసరావు, వై.కష్ణ, సిపిఐ నాయకులు కొటా మాల్యాద్రి, హనుమంతరావు, సిపిఐ(ఎమ్.ఎల్) న్యూడెమోక్రసీ నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు

జిపిఎస్‌పై ఫ్యాప్టో నిరసన

(మొదటి పేజీ తరువాయి)

బాబు, యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు కే.శ్రీనివాసరెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి కె. తిరుపతి స్వామి,రాష్ట్ర ఉపాధ్యాయ సంఘము (ఎస్టీయూ) రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, నాయకులు షేక్ బేగ్, మాట్లాడుతూ ఎన్నికల హామీల్లో భాగంగా మానిఫెస్టోలో రాష్ట్ర ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన వారం రోజులలో సి.పి.యస్ రద్దు చేస్తానని హామీ ఇచ్చి 4 సంవత్సరాలు దాటిన హామీ అమలు కాలేదన్నారు ఉమ్మడి జిల్లా సీపీఎస్ ప్రధాన కార్య దర్శి ఉబెదుల్లా బెగ్ మాట్లాడుతూ 2004 సెప్టెంబర్ 1నుంచి సి పి యస్ అమలు చేసిన కాంగ్రెస్ పార్టీ పాలిత రాష్ట్రాలైన ఛత్తీస్ ఘడ్, రాజస్థాన్, హర్యానా, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వాలు సిపియస్ రద్దు చేశారని పాత పెన్షన్ విధానం అమలు చేస్తున్నారన్నారు. యుటిఎఫ్ జిల్లా కార్య దర్శి కే తిరుపతి స్వామి మాట్లాడు తూ కాంగ్రెస్ పార్టీ డిసెంబర్లో జరిగే తెలంగాణ ఎ న్నికలలో ఈ హామీ ఇచ్చారన్నారు. ఇప్పటికీ అయిన మన రాష్ట్ర ప్రభు త్వం కూడా సిపిఎస్ రద్దు ప్రాధాన్యత గుర్తించాలన్నారు. రాష్ట్ర ఫ్యాప్టో పిలుపు మేరకు అన్ని ఉద్యోగ ఉపాధ్యా య సంఘాలు సిపియస్ రద్దు పై ఉ ద్యమానికి వెనక్కి తగ్గమని, గతంలో కోటి సంతకాల సేకరణ చేపట్టా మన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పం దించి సిసిఎస్ రద్దు చేయాలని లక్షలాది కుటుంబాలు ఆశగా ఎదురు చూస్తున్నాయన్నారు. అనంతరం చిలకలూరిపేట తహసీల్దారు కు ఫ్యాప్టో వినతి పత్రాన్ని అంద చేశారు. ఈ కార్యక్రమంలో సిపీయస్ టీచర్స్, ఉపాద్యాయ, ఉద్యోగ సంఘాల నాయకులు, ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిర్చి సాగుపైనే ఆశలు

(మొదటి పేజీ తరువాయి)

ఎకరాల్లో వరి సాగు అవుతుందని అంచనా ఉండగా ఇప్పటివరకు కేవలం 12 వేల ఎకరాల్లోనే వరి సాగు జరిగింది. గుంటూరు,పల్నాడు జిల్లాల్లో 4.80 లక్షల ఎకరాల్లో పత్తిసాగు చేయాల్సి ఉండగా ఇప్పటివరకు కేవలం 1.85 లక్షల ఎకరాల్లోనే పత్తిసాగు జరిగింది. పల్నాడు జిల్లాలో 50 వేల ఎకరాల్లో కందిసాగు చేయాల్సి ఉండగా వర్షాభావంతో కేవలం 9500 ఎకరాల్లోనే సాగు చేశారు. అయితే మిర్చి సాగుకు పెట్టుబడి అధికంగా ఉండటం వల్ల మరికొంతమంది రైతులు ఆరుతడి పంటలవైపు దృష్టిసారించే అవకాశం లేకపోలేదు.

వివిధచోట్ల అన్నదానాలు

ప్రజాశక్తి-తాడేపల్లి

వినాయకచవితిని పురస్కరించుకుని పట్టణంలోని బ్రహ్మానందపురం, పద్మశాలి బజార్, బోసుబొమ్మ సెంటర్, యానాదుల కాలనీ, పెనుమాక గ్రామంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లో సుమారు 12 వేల మంది అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. కొన్నిచోట్ల కులమతాలకు అతీతంగా అందరూ పాల్గొని మతసామరస్యాన్ని చాటిచెప్పారు.

నేడు హ్యాపీ సండే

ప్రజాశక్తి-తాడేపల్లి : తాడేపల్లి పట్టణంలోని సుందరయ్యనగర్ మానససరోవరంలో నేడు హ్యాపీ సండే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు కె.రామిరెడ్డి తెలిపారు. ఉదయం పది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ కార్యక్రమం జరుగుతుందని చెప్పారు. అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

జిఎంసి ఆధ్వర్యంలో మెగా మెడికల్ క్యాంపు

- 3 వేల మంది కార్మికులకు వైద్య పరీక్షలు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగులు, కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే మెరుగైన అభివద్ధి సాధ్యం అవుతుందని పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు గుంటూరు నగరపాలక సంస్థ మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం జిఎంసి ఆధ్వర్యంలో సఫాయి మిత్ర సురక్ష శివిర్‌లో భాగంగా పారిశుధ్య, యుజిడి కార్మికులకు బ్రహ్మానందరెడ్డి స్టేడియంలో ఏర్పాటు చేసిన మెగా మెడికల్ క్యాంప్ ను నగర కమిషనర్ కీర్తి చేకూరి, ఎంఎల్ఏ మహ్మద్ ముస్తఫాలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజారోగ్య పరిరక్షణలో ముందుండే పారిశుధ్య కార్మికులకు నిష్ణాతులైన వైద్యులతో మెగా మెడికల్ క్యాంప్ నిర్వహించడం అభినందనీయ మన్నారు. కమిషనర్ మాట్లాడుతూ సూర్యోదయానికి ముందే విధుల్లో ఉంటూ, కోవిడ్ వంటి విపత్కర పరిస్తితుల్లోనూ ప్రజారోగ్య పరిరక్షణకు ప్రాణాలను పణంగా పెట్టి పని చేస్తున్న పారిశుధ్య కార్మికుల ఆరోగ్య రక్షణకు జిఎంసి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటుందన్నారు. గత 15 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా జిఎంసిలో పనిచేసే 3 వేల మంది పారిశుధ్య, యుజిడి కార్మికులకు నగరంలోని ప్రఖ్యాత వైద్యులతో వైద్య పరీక్షలు చేయిస్తున్నామన్నారు. మెగా క్యాంప్ లో చర్మ, గైనిక్, ఆర్థో, చెస్ట్, జనరల సర్జరీ, పిడియాట్రిక్స్, ఐయన్టి, ఎన్సిడి, జనరల్, క్యాన్సర్ స్క్రీనింగ్, డెంటల్ వ్యాధులకు వైద్యులు అందుబాటులో ఉంటారని, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల కార్మికులకు 40 కౌంటర్ల ద్వారా రెండు షిఫ్ట్ లుగా వైద్య పరీక్షలు చేస్తున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జరిగే వైద్య పరీక్షల్లో ఫలితాలు 2 రోజుల్లో వస్తాయని, వాటి ఫలితాల మేరకు తదుపరి వైద్య సేవల పై చర్యలు తీసుకుంటామన్నారు. ఎమ్మెల్యే ముస్తఫా మాట్లాడుతూ ప్రస్తుతం వైద్యం ప్రతి ఒక్కరికి ఎంతో కష్టం అవుతున్న తరుణంలో సిఎం జగన్మోహన్‌రెడ్డి పట్టణ ఆరోగ్య కేంద్రాల పెంపు ద్వారా ఇంటి ముందరకే అవసరమైన వైద్యం అందేలా చేశారన్నారు. కార్మికులకు వైద్య పరీక్షల ఫలితాల మేరకు తగిన చికిత్స అందేలా నగరపాలక సంస్థ చర్యలు తీసుకోవాలని, ఇటువంటి క్యాంప్ లు ప్రతి ఏటా జరిగేలా షెడ్యుల్ ఇవ్వాలని నగరపాలక సంస్థ అధికారులను కోరారు. కార్యక్రమంలో డిఎంఅండ్‌హెచ్ఒ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ జయరామకృష్ణ, డిటిసిఒ డాక్టర్ లక్ష్మానారాయక్, డిప్యూటీ మేయర్ షేక్ సజిలా, ఎంహెచ్ఒ డాక్టర్ భాను ప్రకాష్, ఎస్ఈ భాస్కర్, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, టి.వెంకట కష్ణయ్య, సిహెచ్.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు

- పోస్కో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కారుమంచి శ్యామల

ప్రజాశక్తి-గుంటూరు

బాలల హక్కులకు భంగం కల్పిస్తే చర్యలు తప్పవని గుంటూరులోని పోస్కో కోర్ట్ స్పెషల్ పబ్లిక్ ప్రోసిక్యూటర్ కారుమంచి శ్యామల అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ' కేర్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ చిల్డ్రన్: సమస్యలు-సవాళ్లు ' అనే అంశంపై మొట్ట మొదటి అంతర్జాతీయ స్థాయి కాన్ఫరెన్స్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కారుమంచి శ్యామల మాట్లాడుతూ బాలల హక్కులైన విద్యాహక్కు చట్టం, జీవించే హక్కు గురించి బాలలకు ఉండే ఇతర చట్టాల గురించి, పోలీసులు బాలలకు కల్పించే రక్షణ, మంచి స్పర్శ, చెడు స్పర్శ గురించి, పోక్సో చట్టం గురించి, చట్టంతో విభేదించిన బాలురకు ప్రత్యేక బాలల కోర్టులు, రక్షణ కేంద్రం గురించి విద్యార్థులకు వివరించారు. అలాగే ఎవరైనా అనాధ పిల్లలుంటే బాలల అభివద్ధి కమిటీకి అప్పగించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమానికి మరో ముఖ్య అతిథిగా హాజరైన గుంటూరులోని జువెనైల్ జస్టిస్ డిపార్ట్‌మెంట్ లీగల్ కమ్ ప్రొబేషన్ ఆఫీసర్ వాసంతి మాట్లాడుతూ హింసకు గురవుతున్న పిల్లలతో తనకున్న అనుభవాలను పంచుకున్నారు. లైంగిక వేధింపులు, బాల కార్మికులు, మానవ అక్రమ రవాణా వంటి వివిధ మార్గాల్లో పిల్లలు సులభంగా దోపిడీకి గురవుతారని ఆమె తెలిపారు. అందువల్ల వారిని బాల్య గహాలు, సంస్థలు మరియు చట్టాల ద్వారా రక్షించాలన్నారు. సుప్రీంకోర్టు ఆఫ్ ఇండియా అడ్వకేట్ ఆన్ రికార్డ్ ఫిర్దోస్ కుతుబ్ వాని, గుంటూరులోని ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సీఆర్ఏఎఫ్ బోర్డ్ మెంబర్ సరస్వతి రాజు అయ్యర్‌లు పోక్సో చట్టం గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పీ.నాగభూషణ్ తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కారుమంచి శ్యామల, వేదికపైన బి.వాసంతి తదితరులు

దళితవాదాన్ని బలంగా విన్పించిన జాషువా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

తెలుగు సాహిత్యంలో 'దళితవాదాన్ని' మహాకవి జాషువా బలంగా వినిపించారని వి సి కె పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.జె. విద్యాసాగర్ పేర్కొన్నారు. శనివారం గుంటూరులోని కార్ట్స్ హాలులో జాషువా కల్చరల్ సెంటర్ ఆద్వర్యంలో జరిగిన గుర్రం జాషువా 128వ జయంతి సభకు జాషువా కల్చరల్ సెంటర్ గౌరవాధ్యక్షులు ఎస్. బాలస్వామి అధ్యక్షత వహించారు. ప్రముఖ బౌద్ధ రచయిత బొర్రా గోవర్ధన్ గారికి గుర్రం జాషువా సాహితీ పురస్కారం అందించి సత్కరించారు. విద్యాసాగర్ మాట్లాడుతూ జాషువా తన పద్యంతో తెలుగు.జాతిని చైతన్యపర్చారని అన్నారు. మాజీ మంత్రివర్యులు' డొక్కా మాణిక్య వరప్రసాద్ ప్రసంగిస్తూ గుర్రం జాషువా సాహిత్యం చదవడం ద్వారా రాయడం ద్వారా విద్యార్థులు సజనాత్మకంగా ' ఆలోచించగలరని జాషువా, అంబేద్కరు విస్తతంగా అధ్యయనం చేయడం ద్వారా దళిత జాతికి వెలుగునిచ్చారని కొనియాడారు. అసమానతలు, విద్వేషాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే మహాకవి గుర్రం జాషువాకు మనమిచ్చే నిజమైన నివాళి అని జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షులు వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి తెలిపారు. గౌరవ అతిథిగా విచ్చేసిన విశ్రాంత తెలుగు రీడర్ డాక్టర్ ఎం స్వర్ణలత దేవి ప్రసంగిస్తూ సమాజంలో దళిత స్త్రీల వ్యధలను మహిళల గొప్పతనాన్ని సాహిత్యంలో సజించారని తెలిపారు ఈకార్యక్రమంలో జాషువా కల్చరల్ సెంటర్ ప్రధాన కార్యదర్శి పి.వి రమణ, సామాజిక ఉద్యమకారులు నాదెండ్ల బ్రహ్మయ్య, జాషువా కల్చరల్ సెంటర్ కార్యవర్గ సభ్యులు గోనె లూదర్ పాల్, బిల్లా నాగరాజు కత్తి లేనినా వివిధ ప్రజాసంఘ నేతలు పాల్గొని ప్రసంగించారు. జట్టి బాబురావు, చంద్రపాల్' మంద వెంకట్రావు తదితరులు జాషువా పద్యాలను ఆలపించారు.

ఐసియూలో అపరిశుభ్రతపై ఆగ్రహం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

ప్రభుత్వ ఆసుపత్రి లో ప్రైవేట్ భాగస్వా మ్యం తో నిర్వహిస్తున్న నెఫ్రో ప్లస్ వార్డు లో అవసరమైన సదుపాయాలను కల్పించుకోవాలని సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ సూచించారు. శనివారం ఆయన ఆకస్మికంగా నెఫ్రో ప్లస్ వార్డును తనిఖీ చేశారు. వార్డును చూడగానే అపరిశు భ్రమైన వాతావరణం కనిపించిందని ఆయన చెప్పారు. చూడటానికి ఐ సి యు లా కనిపించలేదు. రంగులు వెలసిపోయినట్లు కనిపించింది. మరుగు దొడ్లు లలో చెత్త వాసన కంపు కొడుతోంది. ఈ వార్డు లో అనేక మార్పులు చేర్పులు చేయాల్సిందిగా సూచించ్చినట్లు ఆయన చెప్పారు. సాంకేతిక ఇంజినర్ నిపుణులు, నర్సింగ్ సిబ్బంది ని వెంటనే నియమించాలని ఆయన సూచించారు. అదేవిధంగా నెఫరాలజస్ట్ ను కూడా తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆసుపత్రి నుంచి అవసరాన్ని బట్టి కార్డియాలజిస్టు వస్తారని ఆయన చెప్పారు. ఒక్కొక్క డయాల్సిసిస్ బాధితునికి రూ.1069 చెల్లిస్తున్నప్పుడు సదుపాయాలు కూడా అద్భుతంగా అందించాల్సిన అవసరం ఉందని ఆయన కోరారు. ప్రతి పడకకు ఒక మానిటర్, వెంటిలేటర్, ఆక్సిజన్ అందే విధంగా చూడాలని సిబ్బందికి ఆయన ఆదేశించారు. 24 గంటల పాటు ల్యాబ్ ను ఉండే విధంగా చర్యలు చేపట్టాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ వెంకట రమణ, నర్సింగ్ సూపరింటెండెంట్ ఆశా సజని పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు వివాహితులు ఆత్మహత్య

అనుమానా స్పదంగా గర్భిణి మృతి

రెండు రోజుల క్రితం సంఘటన - అంత్యక్రియల రోజు ఉద్రిక్తం

ప్రజాశక్తి- దుగ్గిరాల

శ్రీలక్ష్మీ మృతదేహం

మండలంలోని మంచికలపూడి గ్రామంలో జరిగిన అనుమానాస్పద మృతి సంఘటన గ్రామంలో తీవ్ర ఉద్రిక్తత కు దారి తీసినది. సేకరించిన వివరాల ప్రకారం దుగ్గి రాలకు చెందిన శ్రీ లక్ష్మి (27)కి మంచికలపూడి గ్రామానికి చెందిన ఆరాధ్యుల వెంకట స్వామితో ఐదు సంవత్సరాల క్రితం వివాహమైనది. ప్రస్తుతం ఆమె మూడు నెలల గర్భిణి. భార్యాభర్తల మధ్య గురువారం ఉదయం ఘర్షణ జరిగినట్లు తెలిసినది. గురువారం రాత్రి శ్రీలక్ష్మి ఉరి వేసుకుని చనిపోయినట్లు భర్త తరపున బంధువులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. శుక్రవారం పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే ఆ రోజు శవ పంచనామా జరగలేదు. శనివారం దుగ్గిరాల తహసిల్దార్ కే మల్లేశ్వరి సమక్షంలో పంచనామ నిర్వహించి పోస్టు మార్టం చేయించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు. శనివారం సాయంత్రం అంత్యక్రియలు నిర్వహించారు. ఈ క్రమంలో గ్రామంలో ఉద్రిక్త వాతావరణం నెలకొనగా దుగ్గిరాల ఎస్ఐ ఏ శ్రీనివాస్ రెడ్డి తన సిబ్బందితో అంత్యక్రియలు పూర్తి అయ్యే వరకు గ్రామంలోనే ఉన్నారు. విచారణ నిర్వహించ వలసి ఉన్నది.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

అనుమానాస్పద స్థితిలో కొండ్రు అనిత (20) వివాహిత మృతి చెందిన ఘటన మండలంలోని బ్రాహ్మణపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. పట్టణ సిఐ వీరాంజనేయులు తెలిపిన వివరాల ప్రకారం

కొండ్రు అనిత మృతదేహం

బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన కొండ్రు అనిత అదే గ్రామానికి చెందిన ముత్తయ్యకు రెండు సంవత్సరాల క్రితం వివాహం జరిగిందని గత కొంతకాలంగా కుటుంబంలో గొడవలు జరుగుతున్నాయని తెలిపారు. శుక్రవారం కొండ్రు అనిత తండ్రితో కలిసి పుట్టింటికి వచ్చిందని శనివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని చని పోయినట్లు తెలియజేశారు. జరిగిన ఘటనపై సమాచారం అందుకున్న పట్టణ సీఐ వీరాంజనేయులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తామని పేర్కొన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించనున్నట్లు తెలియజేశారు.

నిందితులను అరెస్టు చూపుతున్న ఇంఛార్జి సెబ్ సూపరింటెండెంట్,డీఎస్పీ దుర్గాప్రసాద్

భారీగా గోవా మద్యం స్వాధీనం

ప్రజాశక్తి-ఈపూరు

రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్న పాలెంలో విశ్వసనీయ సమాచారంతో స్పెషల్ ఎన్ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ వీరవల్లి సైమన్ సిబ్బందితో శనివారం దాడులు నిర్వహించి గోవా మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మీడియా సమావేశంలో డిఎస్పి దుర్గాప్రసాద్ మాట్లాడారు. రొంపిచర్ల మండలం బుచ్చిపాపన్నపాలెం గ్రామానికి చెందిన చల్లా వెంకట సాయి కృష్ణ, రొంపిచర్ల మండలం ముత్తనపల్లి గ్రామానికి చెందిన గోరంట్ల లక్ష్మీనారాయణ, సంతమాగులూరు మండలం తంగెడు మల్లి గ్రామానికి చెందిన అద్దంకి విజయకుమార్, పంగులూరు మండలం జనకవరం గ్రామానికి చెందిన కొండేపి రాములు గోవా రాష్ట్రం నుండి మద్యాన్ని తరలించి అక్రమ మద్యం వ్యాపారం చేస్తున్నారని అన్నారు. నలుగురిని అదుపులోకి తీసుకోవడంతో పాటు వారి వద్ద ఉన్న 55 మద్యం కేసులు, ఒక ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితులను నరసరావుపేట కోర్టులో హాజరు పరుస్తామని డిఎస్పీ తెలిపారు.

నిమజ్జనానికి నీళ్ళు కరువు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రతి ఏడు జూలై, ఆగష్టు నెలలలో కురిసిన వర్షాల వలన నాగార్జునసాగర్ రిజర్వాయర్‌కు నీరు రావటం, అక్కడి నుండి కుడికాలువ ద్వారా నీటి ప్రవాహం జరుగుతుండటంతో నిమజ్జనానికి నీటి కొరత ఉండేది కాదు. ఈ ఏడాది సాగర్ రిజర్వాయర్‌కు నీటి చేరిక రాకపోవటంతో రిజర్వాయర్ నీటిమట్టం డెడ్ స్టోరేజిలో ఉండటం వలన సాగరు కుడికాలువకు నీటి విడుదల లేదు. పట్టణం, పరిసర గ్రామాలలో వినాయకచవితి సందర్భంగా ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాల నిమజ్జనానికి సాగర్ నూతన బ్రిడ్జి దగ్గరకు వెళ్ళవలసి వస్తుంది. గతంలో కంభంపాడు బ్రిడ్జి వద్ద, మాచర్ల బోంబాయి కంపెనీ బ్రిడ్జి వద్ద, తాళ్ళపల్లి కుడికాలువ బ్రిడ్జి వద్ద నిమజ్జనాలు జరిగేవి. ఈ ఏడాది పట్టణ, పరిసర ప్రాంతాలలో నీరు లేకపోవటంతో నాగార్జునసాగర్ ప్రాజెక్ట్ సమీపంలోని కొత్త బ్రిడ్జి వద్దకు వెళ్ళి అక్కడ నిమజ్జన కార్యక్రమాలు చేస్తున్నారు.

రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - తెనాలి

రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లకు శనివారం ఎస్ఐ సిహెచ్ వెంకటేశ్వర్లు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికలపై నిత్యం నిఘా ఉంటుందని, ప్రవర్తన మార్చుకోవాలని హెచ్చరించారు. ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, అల్లర్లు సష్టించేందుకు ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవన్నారు. కౌన్సిలింగ్ లో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ వెంకటేశ్వర్లు

నిమజ్జనం చూసేందుకు వెళ్లిన యువకుడిపై దాడి

ప్రజాశక్తి -తెనాలి

వినాయక నిమజ్జనం చూసేందుకు వెళ్లిన యువకుడిపై దాడి జరిగింది. కేసు నమోదు చేసిన పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం నందుల పేటకు చెందిన మనోజ్ నాజరుపేటలో జరుగుతున్న నిమజ్జనం ఊరేగింపు చూసేందుకు శుక్రవారం రాత్రి వెళ్ళాడు. స్వల్ప విషయమై జరిగిన వివాదంలో బొమ్మిశెట్టి వెంకటేష్, మనోజ్ పై దాడి చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మనోజ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మారీసుపేటలో గుర్తు తెలియని మృతదేహం

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక మారిసుపేటలో గుర్తు తెలియని మతదేహాన్ని త్రీ టౌన్ పోలీసులు కనుగొన్నారు. మారీసుపేట గుర్రాల సందులో పడివున్న మతదేహంపై శనివారం స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మతుని వయసు 30 నుంచి 35 సంవత్సరాలు ఉంటుందని, మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాల కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బిఎస్పీ ఎన్నికల సన్నాహక సమావేశం

ప్రజాశక్తి-తెనాలి

పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమం రాజ్యాధికారం ద్వారానే సాధ్యమని బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బి. పరంజ్యోతి అన్నారు. స్థానిక ఐతానగర్ ఎర్రబడి వద్ద శనివారం ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పరంజ్యోతి మాట్లాడుతూ బహుజన సమాజ్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని, రానున్న ఎన్నికలను ఎదుర్కొనేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ఏ పార్టీ అధికారంలోకి వచ్చినా బహుజన కులాల అభివృద్ధి లేదని, వారి స్థితిగతులు అత్యంత దారుణంగా ఉన్నాయని, పనులు లేక, కుటుంబాలు గడవక, వలస జీవితాలతో కాలం వెళ్లబుచ్చుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల నుండి బయటపడేందుకు బహుజన సమాజ్ పార్టీని అధికారంలోకి తీసుకురావాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఎల్. కుమార్, కూరపాటి సుబ్బారావు, కాగిత కోటేశ్వరరావు, దాసరి వెంకటేశ్వరరావు, గూడవల్లి మణికుమారి, యాతాటి కిషోర్, మట్లపూడి సాంబశివరావు, పార్టీ కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

మహారాజ శ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...

I.P.No 57/2023

కాకుమాను నాగ సాయినాథ్ ....పిటిషనర్

AND

1) సంకూరి రాజేష్, 2) రాయల రామకృష్ణ, 3) బత్తినేని రాజేష్ 4) ఓబుల శెట్టి నరసింహారావు, 5) కేతావతు సోము సుందర నాయక్, 6) యద్లమూరి ప్రవీణ్, 7) తోట ఫణి కుమార్, 8) పోతినేని రామకృష్ణ, 9) అంకినీడు ప్రసాద్, 10) షేక్ జాకీర్ హుస్సేన్ .... రెస్పాండెంట్లు.

పై నెంబర్ దావాలో పిటిషనర్ ఇందలి రెస్పాండెంట్లకు ఇవ్వవలసిన బాకీలు చెల్లించలేని పరిస్థితులలో పై నెంబర్ ఐపి దావా దాఖలు చేసినాడు. ఇందలి రెస్పాండెంట్లు కాకుండా పిటిషనర్ ఇంకా ఎవరికైనా ఇతరులకు డబ్బు బాకీ ఉన్న యెడల ఈ పేపర్ నోటీసు ద్వారా 27-09-2023 న ఉదయం 10:30 ని.లకు పై కోర్టువారి ఎదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

ఇట్లు.
టి.రామకృష్ణ,
పిటిషనర్ తరపు న్యాయవాది,
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.

వైరల్ ఫీవర్లతో అల్లాడుతున్న ప్రజలు

ప్రజాశక్తి - మాచర్ల

వైరల్ ఫీవర్లతో పట్టణ, పరిసర గ్రామాల ప్రజలు అల్లాడుతున్నారు. ఈ మధ్య కురుస్తున్న వర్షాలకు మారిన వాతావరణ పరిస్థితులకు దోమలు పెరిగి ప్రజలు జ్వరాల భారిన పడుతున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స కోసం అధిక సంఖ్యలో డాక్టర్లను ఆశ్రయిస్తున్నారు. ప్రైవేట్ ఆసుపత్రులకు వెళితే వేలల్లో ఖర్చు అవుతుండటంతో విష జ్వరాల భారిన పడిన ప్రజలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. దోమల నివారణకు ప్రజారోగ్య శాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. పట్టణంలో ఫాగింగ్ చేపట్టాలని, మురుగునీరు నిల్వ లేకుండా చూడాలని, అవసరమైన చోట్ల నాఫ్తలీన్ బాల్స్ వేసి దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. గ్రామాలలో కూడ ప్రజారోగ్య శాఖ అధికారులు సర్వే జరిపి ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేయాలని, అవసరమైన చర్యలు తీసుకునేందుకు సత్వరం స్పందించాలని ప్రజలు కోరుతున్నారు. మురుగునీరు నిల్వ ఉండే ప్రదేశాలలో దానిని తొలగించేందుకు ప్రజారోగ్య శాఖ సిబ్బందితో గ్యాంగ్ వర్క్ చేపట్టి దోమల నివారణకు కృషి చేయాలని ప్రజలు కోరుతున్నారు. నీరు కలుషితం కావటం వలన, అవి త్రాగిన వారికి విష జ్వరాలు వస్తున్నట్లుగా ప్రజారోగ్యశాఖ అధికారులు తెలియజేస్తున్నారు. ప్రజలు కాచి చల్లార్చిన నీటిని త్రాగితే మంచిదని సూచించారు.

మహారాజశ్రీ నరసరావుపేట అదనపు సీనియర్ సివిల్‌జడ్జి వారి కోర్టులో

ఓ.యస్.నెం. 258/2016

బిట్వీన్ :

గోవాడ నాగరాజు మరియు తదితరులు ... పిటీషనర్లు /ప్రతివాదులు

మరియు

తూబాటి శ్రీను ... రెస్పాండెంట్ / వాది

పై నెంబరు దావానందు పిటీషనర్ / 5వ ప్రతివాదికి తూబాటి సామ్రాజ్యం భర్త సత్యనారాయణ అను ఆమె తనకు రాసిన సెటిల్‌మెంట్ దస్తావేజు ప్రకారం 16-11-2022వ తేదీన దావాలో చూపబడిన షెడ్యూలు ఆస్తి 1వ ఐటమ్‌కు చెందులాగున వ్రాసి యుండుట కారణముగా పిటీషన్ / 5వ ప్రతివాది ఆర్డరు 1 రూస్ 10 ప్రకారం పిటీషన్ దాఖలు చేయగా శ్రీ కోర్టువారు 26-9-2023వ తేదీన ఉదయం 10-00 గం.లకు శ్రీ కోర్టువారి ఎదుట స్వయంగా గానీ, లేదా లాయరుగారి ద్వారా గానీ హాజరై మీ యొక్క అభ్యంతరములు ఏమైనా వున్నయెడల తెలుపవలెను. లేనిచో పరోక్షంగా తీర్మానం చేయబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది.

వాయిదాతేది: 26-9-2023

శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం ఆర్డరు వేయబడినది.

కందేపు కృష్ణమూర్తి, న్యాయవాది,
శ్రీకాంప్లెక్స్, నరసరావుపేట.

మహారాజశ్రీ నరసరావుపేట అడిషనల్ సీనియర్ సివిల్ జడ్జి గారి కోర్టులో...

O.S 554/2015 I.A 374/2023

షేక్ హుస్సేన్ సాహెబ్ .....పిటిషనర్

AND

1) షేక్ జహీరాబి మరియు వగైరాలు...రెస్పాండెంట్లు.

To,

R2) షేక్ హలీమా w/o ఆదం షఫీ (లేట్)
D.No. 225 - 169, మద్ది నగర్, చిలకలూరిపేట పట్టణం, పల్నాడు జిల్లా.

పై నెంబర్ ధావాను రెస్టొవర్ చేయించమని I.A.374/2023 పిటిషన్ దాఖలు చేసి సదరు పిటిషన్ పైన మీకు ఎన్ని సార్లు నోటీసులు పంపినను దావా విషయం తెలిసి కూడా మీరు నోటీసులు తీసుకోనందున శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల ప్రకారం ఈ పేపర్ నోటీసు ద్వారా 27-9-2023 న ఉదయం 10:30 ని.లకు పై కోర్టువారి ఎదుట మీరు హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

వాయిదాతేది: 27-9-2023

ఇట్లు.
పి.పాండురంగారావు
పిటిషనర్ తరపు న్యాయవాది
చిలకలూరిపేట, పల్నాడు జిల్లా.

చిన్నారులకు వైద్య సేవలు అందిస్తున్న డాక్టర్ లంకా ప్రత్యుష

వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ ఉచిత వైద్య శిబిరం

100 మందికి పైగా చిన్నారులకు వైద్య సేవలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట పట్టణంలోని వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో చిన్న పిల్లలకు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. స్థానిక ప్రాతూరి సచివాలయంలో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో వెన్నెల హాస్పిటల్ అధినేత్రి డాక్టర్ లంకా ప్రత్యుష ,100 మందికి పైగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. చిన్న పిల్లలకు సోకే సీజనల్ వ్యాధుల నివారణకు తల్లిదండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. పిల్లల్లో ఎదుగుదల సమస్యలు పౌష్టికాహార లోపం, పురిటి పిల్లల సమస్యలు , విష జ్వరాలు, ఆస్తమా, ఫిట్స్, వాంతులు, విరోచనాలు వంటి సమస్యలకు తమ హాస్పిటల్ లో వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారు. డాక్టర్ ప్రత్యూష భర్త, మహాత్మాగాంధీ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ కన్సల్ట్ వైద్యులు, ప్రముఖ న్యూరాలజిస్ట్ డాక్టర్ సూరా ప్రదీప్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఇటీవల స్థాపించిన తమ హాస్పిటల్ ద్వారా పేద తల్లిదండ్రుల చిన్నారులకు వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ఉచిత వైద్య శిబిరం నిర్వహించినట్లు చెప్పారు. రానున్న రోజులలో వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కూడా చిన్నారులకు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని, ఆరోగ్య అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తామని అన్నారు. ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసిన వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ యాజమాన్యాన్ని వార్డు పెద్దలు ఘనంగా సత్కరించారు. వైద్యశిబిరంలో వెన్నెల చిల్డ్రన్స్ హాస్పిటల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎంఎఎం కళాశాల అధినేత రామశేషగిరిరావు పుట్టినరోజు

పేద విద్యార్థులకు అన్నదానం

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

నరసరావుపేట మండలంలోని కేసానుపల్లి పరిధిలోని ఎంఎఎం ఫార్మసీ కళాశాల అధినేత మేదరమెట్ల రామశేషగిరిరావు పుట్టినరోజు సందర్భంగా నాదెండ్ల మండలం మైనంపాడులోని నైస్ స్కూల్ (అనాథ,పేద పిల్లలకు విద్య వసతి)లో 200 మంది విద్యారినీ విద్యార్థులకు శనివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామశేషగిరిరావు మాట్లాడుతూ పేద విద్యార్థుల మధ్య తన పుట్టిన రోజు జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల మధ్య కేక్ కట్ చేసి వారికి పంచి పెట్టారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.ప్రసాదరావు ఆధ్వర్యంలో కళాశాలల అధ్యాపకులు అధ్యాపకేతర సిబ్బంది , విద్యార్థులు ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో రామ శేషగిరిరావు భార్య అనంతలక్ష్మి, కుమార్తె దరువురి శ్రావ్య, శ్రీ బ్లడ్ బ్యాంక్ అధినేత పిన్నింటి సత్యప్రసాద్, కృష్ణవేణి డిగ్రీ కాలేజ్ ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వర్లు, పుష్పావతి ఆగ్రో టెక్ ప్రైవేట్ లిమిటెడ్ అధినేత నాసరయ్య, పథ్వి కన్స్ట్రక్షన్స్ అధినేత దరువురి నాగేశ్వరావు, వై.కోటేశ్వరమ్మ నైస్ స్కూల్ ప్రిన్సిపల్ ఎన్ రాజ్యలక్ష్మి, ఫార్మసీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం ప్రసాదరావు, ఇంజనీరింగ్ కాలేజ్ ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ రామారావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీల సమస్యలను పరిష్కరించండి

ప్రజాశక్తి పెదకూరపాడు

ఆంధ్రప్రదేశ్ అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో అంగన్వాడీల సమస్యలపై క్రోసూరు ప్రాజెక్ట్ సిడిపిఒ స్వర్ణకుమారికి శనివారం డిమాండ్లతో కూడిన వినతపత్రాన్ని అందజేశారు. ఈ నెల 25వ తేదీన విజయవాడలో ధర్నా చౌక్ వద్ద సిఐటియు , ఏఐటియుసి, ఐఎఫ్టియు మూడు సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న సామూహిక దీక్షలో పాల్గొననున్నట్టు వారు చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్టు కార్యదర్శి జయలక్ష్మి, అధ్యక్షులు శివపార్వతి, అంగన్వాడి కార్యకర్తలు, ప్రజా సం ఘాల నాయకులు టి.హనుమంతరావు పాల్గొన్నారు.

క్రోసూరు ప్రాజెక్టు సిడిపిఒ స్వర్ణకుమారికి డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేస్తున్న చిత్రం

నాదెండ్ల సిడిపిఒకు సమ్మె నోటీసు అందజేస్తున్న చిత్రం

ప్రజాశక్తి నాదెండ్ల

ఈ నెల 25వ తేదీన విజయవాడలో జరగబోయే సభను జయప్రదం చేయాలని కోరుతూ శనివారం నాదెండ్ల సిడిపిఒకు సమ్మె నోటీసును అందజేశారు. అంగన్వాడీల వేతనాలు పెంచాలని, గ్రాడ్యుటి అమలు చేయాలని, అంగన్వాడి వర్కర్స్ మినీ హెల్పర్స్ కనీస వేతనాలు చెల్లించాలని, తెలంగాణ కన్నా అదనంగా వేతనాలు ఇవ్వాలని,తక్షణమే సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం అంగన్వాడీలకు గ్రాడ్యుటీని అమలు చేయాలి ,రాష్ట్రంలో ఉన్న మినీ సెంటర్లని మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు ప్రమోషన్లు ఇవ్వాలని, రిటైర్మెంట్ వయసును 62 సంవత్సరాలకు పెంచాలని, ఆఖరి వేతనంలో 50 శాతం పెన్షన్ ఇవ్వాలని మొదలైన డిమాండ్లు చేశారు. సమ్మె నోటీసును అందజేసిన వారిలో పేరుబోయిన వెంకటేశ్వర్లు, అంగన్వాడి డివిజన్ అధ్యక్షులు సావిత్రి పాల్గొన్నారు

యుటిఎఫ్ స్వర్ణోత్సవ పోస్టర్ ఆవిష్కరణ

జిల్లా వ్యాప్తంగా 28న యుటిఎఫ్ఎఫ్ స్వర్ణోత్సవ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

యుటిఎఫ్ 50వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని యుటిఎఫ్ కార్యాలయంలో శనివారం స్వర్ణోత్సవ వాల్ పోస్టర్ ను యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కౌన్సిలర్ కాసిం పీరా, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ జమాల్,మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎందరో మహానుభావులు, ఉద్యమకారులు వారి త్యాగాల ఫలి తంగా ఇప్పుడు ఉపాధ్యాయులు అనేక ఫలితాలను, సౌకర్యాలను అనుభవిస్తున్నారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై రాజీ లేకుండా నిరంతరం పోరాడే సంఘం యుటిఎఫ్ అని తెలియజేశారు. యుటిఎఫ్ సభ్యులుగా, కార్యకర్తలుగా, నాయకులుగా ఉండడం తమకెంతో గర్వకారణమని అన్నారు. ఈ నెల 28న యుటిఎఫ్ఎఫ్ స్వర్ణోత్సవ బైక్ ర్యాలీ పల్నాడు జిల్లా వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ స్వర్ణోత్సవ బైక్ ర్యాలీలో ఉపాధ్యాయులు, ఉద్యోగులు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో మండల గౌరవ అధ్యక్షులు ప్రసాద్, అధ్యక్షులు సాంబశివ రావు, అధ క్షులు ఫిరోజ్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు మరియ దాసు, చంద్రశేఖర్,సత్యనారాయణ,లక్ష్మణ్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ కార్యాలయంలో స్వర్ణోత్సవ వాల్ పోస్టర్ ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

పంట పొలాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు

30లోపు ఈ-క్రాప్ బుకింగ్ తప్పనిసరి

ప్రజాశక్తి-నకరికల్లు

మండలంలోని చేజర్ల గ్రామ రైతు భరోసా కేంద్రాన్ని మండల వ్యవసాయ శాఖ అధికారి దేవదాసు శనివారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు భరోసా కేంద్రం లోని ఎరువులను, డిఎపి యూరియా నిల్వలను పరి శీలించారు. పిఎం కిసాన్ ఈ కేవైసీ పెండింగ్ ఉన్న జాబితాలను పరిశీలించి త్వరగా రైతులందరికీ ఇ-కెవైసి చేయిం చాలని సిబ్బందిని ఆదేశించారు. వివిధ రకాల పంటలను సాగు చేసే రైతులు ఈ నెల 30వ తేదీ లోపు ఈ-క్రాప్ బుకింగ్, పీఎం కిసాన్ ఈ-కేవైసీ తప్పనిసరిగా చేసుకోవాలని సూచించారు. అదేవిధంగా ఈ కేవైసీ మండల పరిధిలో 895 మంది రైతులు చేయలేదని వెంటనే రైతు భరోసా కేంద్రాలలో సిబ్బందిని సంప్రదించి పూర్తి చేయించుకోవాలని రైతులకు తెలిపారు. అనంతరం వ్యవసాయ పంట పొలా లను పరిశీలించారు. కార్యక్రమంలో విఎఎ వంశీ పాల్గొన్నారు.

లేమల్లె, అత్తలూరులో వ్యవసాయ క్షేత్రాల పరిశీలన

ప్రజాశక్తి-అమరావతి

మండలంలో లేమల్లె గ్రామం, అత్తలూరు గ్రామాలలో రైతు సాధికార సంస్థ నుంచి చంద్రశేఖర్ తిమ్మాటిక్ లీడ్, రీజినల్ కోఆర్డినేటర్ వెంకట్రావు ప్రకతి వ్యవసాయ క్షేత్రలని సందర్శించారు.లేమల్లె గ్రామంలో కోసూరు పద్మా పత్తి పంట పరిశీలించారు.పత్తి పంటలో గులాబి రంగు పురుగు గుర్తించామని అన్నారు రైతులకు గులాబీ రంగు పురుగు నివారణకి లింగాకర్షణ బుట్టలు పెట్టుకోవాలని సూచించారు. అత్తలూరు గ్రామంలో అనంతరం నాగలక్ష్మి ప్రకతి వ్యవసాయ పద్ధతిలో పండిస్తున్న పత్తి పంట పరిశీలించారు. పత్తి పంట లో అంతర్గత పంటలుగా వేసిన గోరుచిక్కుడు, బెండ పరిశీలించామన్నారు. అత్తలూరు లో ప్రకృతి వ్యవసాయ రైతు ఆదాం ఆధ్వర్యంలో పలు పంటలు పరిశీలించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఎ నందకుమార్, అత్తలూరు యూనిట్ ఇన్‌ఛార్జి రాజు, రమాదేవి పాల్గొన్నారు.

ఆర్కియాలజీ మ్యూజియంలో స్వచ్ఛభారత్

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి ఆర్కియాలజీ మ్యూజియంలో శనివారం స్వచ్ఛభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు.అసిస్టెంట్ సూపరింటెండెంట్ బోయ, అసిస్టెంట్ ఆర్కియాలజిస్ట్ సూర్యప్రకాష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆర్కియాలజీ సూపరింటెండెంట్ గోపీనాథ్ ఆదేశాలతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మ్యూజియంలో 15 రోజులపాటు స్వచ్ఛభారత్ కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో చిన్నబాబు,ఎస్ఐఎస్, మ్యూజియం సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయిల ద్వారా రంగు మారిన నీరు



ప్రజాశక్తి - మంగళగిరి

మంగళగిరి పట్టణంలో కొద్ది రోజులుగా కుళాయిల ద్వారా తాగునీరు రంగు మారి సరఫరా అవుతోంది. ఈ నీటిని తాగటం వల్ల ఇప్పటికే పలువురు వాంతులు, విరోచనాలతో చికిత్స పొందేందుకు అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్లు, ప్రైవేట్ ఆసుపత్రులకు క్యూ కడుతున్నారు. తాగునీరు రంగు మారి సరఫరా కావడం ఫిల్టరేషన్ సరిగా జరగకపోవడం కారణాలుగా తెలుస్తున్నాయి. పలువురు బాధితులు చేత వైద్యులు తమ బాధను అధికారులకు తెలియజేయించారు.

ఆలస్యంగా మేల్కొన్న అధికారులు

గత కొద్ది రోజులుగా మంగళగిరి నగరంలో తాగునీరు కుళాయిల ద్వారా రంగు మారి బురదమయమై సరఫరా అవుతున్నప్పటికీ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచనలు చేసిన దాఖలాలు లేవు. బాధితుల నుండి ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో శుక్రవారం ఆయా క్లస్టర్ల పరిధిలోని వాలంటీర్ల గ్రూప్‌లో మొక్కుబడిగా సందేశం పంపారు. కొద్దిరోజులుగా రంగు మారిన నీరు సరఫరా అవుతుంటే కనీసం గమనించకుండా ఆసుపత్రి నుండి ఫిర్యాదు వస్తే కానీ ఈ మాత్రం సందేశం అయినా పంపరా ప్రజారోగ్యం అంటే అంత చులకన అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పట్టణ సమీపంలోని ఎన్నారై ఆస్పత్రికితో పాటు స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రిలో వైయస్సార్ అర్బన్ హెల్త్ సెంటర్ లకు విరోచనాలు వాంతులతో బాధపడుతున్న బాధితులు ఎక్కువ సంఖ్యలో వెళుతున్నారు. రంగు మారి వస్తున్న నీటి వల్ల చిన్నారులు తీవ్ర అస్వస్థతకు గురవుతున్న ఘటనలు లేకపోలేదు. డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శ్రావణ బాబు శుక్రవారం రాత్రి మంగళగిరి పట్టణంలోని వివిధ ప్రాంతాలను పరిశీలించారు. బాధితులను పరామర్శించారు. నీటిని శాంపిల్స్ సేకరించి పరీక్షలకు ల్యాబ్ పంపినట్లుగా తెలిపారు. శనివారం కార్పొరేషన్ అధికారులు వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. కలుషిత నీటి పై అధికారులు కార్పొరేషన్ కార్యాలయంలో సమీక్ష చేస్తున్నారు. శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

25న విజయవాడలో అంగన్వాడీల మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

అంగన్వాడి వర్కర్స్, హెల్పర్లు అందర్నీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఈనెల 25న విజయవాడ, లెనిన్ సెంటర్‌లో జరిగే మహాధర్నాలో అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దీప్తి మనోజ పిలుపునిచ్చారు. శనివారం గుంటూరు, పొన్నూరు ప్రాజెక్ట్ మహాసభ స్థానిక పాతగుంటూరు సిఐటియు కార్యాలయంలో సుకన్య అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు వై.నేతాజీ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు తెలంగాణ రాష్ట్రంలో ఇస్తున్న వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తానన్న వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని కోరారు. ఎఫ్‌ఆర్‌ఎస్ యాప్ రద్దు చేయాలని, గ్రాట్యుటీ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. పెరుగుతున్న ధరలకు రూ.26వేలు కనీస వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీ సెంటర్స్ లో మౌలిక సదుపాయాలు మెరుగుపరచాలని కోరారు. పెండింగ్ వేతనాలు,అద్దె బిల్లులు, కూరగాయల బిల్లులు వెంటనే చెల్లించాలని, ఈవెంట్స్ నిర్వహణ కయ్యే ఖర్చులను తక్షణమే చెల్లించాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారానికి సెప్టెంబర్ 25న జరిగే మహా ధర్నాలు వర్కర్స్ హెల్పర్స్ పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రాజెక్టు నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతన అధ్యక్ష కార్యదర్శులుగా సుకన్య, రత్న మంజుల, కోశాధికారిగా కనకవల్లి, సహాయ కార్యదర్శులుగా విజయ కుమారి, రాధా, ఉపాధ్యక్షులుగా ధనశ్రీ, పద్మజ, కష్ణకుమారులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

మాట్లాడుతున్న దీప్తి మనోజ

భారతీయ సంగీతం అజరామరం

ప్రజాశక్తి-గుంటూరు

భారతీయ సంగీతానికి పశుపక్ష్యాదులు, ప్రకృతి పరవశించటం జగమెరిగిన సత్యం అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసన సభ ఓఎస్‌డి డాక్టర్ ఎం.ప్రభాకర్ అన్నారు. ప్రముఖ డోలు విద్యాంసులు, లయబ్రహ్మ భూసురుపల్లి ఆదిశేషయ్య ఆరాధన ఉత్సవం స్థానిక బృందావన్ గార్డెన్స్, వెంకటేశ్వరాస్వామిదేవస్థానం, పద్మావతి కళ్యాణ వేదికపై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'అమ్మ తలపులు' పుస్తకాన్ని ఆవిష్కరించిన అనంతరం భూసురుపల్లి ఆదిశేషయ్య సంగీత పురస్కారాన్ని కేంద్ర సంగీత నాటక అకాడమీ పురస్కార గ్రహీత, నాదభగీరథ ద్వారం దుర్గాప్రసాద్‌కు అందచేశారు. సభకు సాహితీవేత్త మోదుగుల రవికృష్ణ అధ్యక్షత వహించగా, కార్యక్రమంలో నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత ఆచార్యులు ఎం.కోటేశ్వరరావు, డాక్టర్ సెట్లం చంద్రమోహన్, ఆలయ కమిటీ అధ్యక్షులు చిట్టిపోతు మస్తానయ్య, డాక్టర్ భూసురుపల్లి వెంకటేశ్వర్లు, విజయలక్ష్మి పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ప్రభాకర్ తదితరులు

ఎల్ఎల్ బి ఆనర్స్ కోర్సుకు బిఒఎస్ ఆమోదం

ప్రజాశక్తి -ఎఎన్‌యు :ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో నూతనంగా ప్రారంభించిన బిఏ ఎల్ ఎల్ బి (ఆనర్స్), బిబిఏ ఎల్.ఎల్.బి (ఆనర్స్) కోర్సులకు బోర్డ్ ఆఫ్ స్టడీస్ ఆమోదం తెలిపిందని లా విభాగాధిపతి ఆచార్య ఎల్.జయశ్రీ శనివారం తెలి పారు. ఈ సమావేశంలో అకడమిక్ విధానాలు, కోర్సు స్ట్రక్చర్, సిలబస్ ను నిర్ధారించారు. బిఓఎస్ చైర్మన్ ఆచార్య ఎన్. రంగయ్య, బి ఓ ఎస్ సభ్యులు పాల్గొన్నారు.

పేదల డాక్టర్ హనుమంతరావు మృతి

ప్రజాశక్తి-తాడేపల్లి :తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన జనవిజ్ఞాన వేదిక నాయకులు, పేదల డాక్టర్ (ఆర్ఎంపి) మాలపాటి హనుమంతరావు (54) కన్ను మూశారు. విశాఖపట్నంలో ఓ సమావేశానికి హాజరైన ఆయన గుండెపోటుతో శుక్రవారం మృతి చెందారు. శనివారం ఆయన భౌతికకాయాన్ని తాడేపల్లి పట్టణంలోని ప్రకాష్‌నగర్‌కు తీసుకొచ్చారు. హనుమంతరావు భార్య కొద్దికాలం క్రితమే మృతిచెందారు. ఆయనకు ఇద్దరు పిల్లలు. జనవిజ్ఞాన వేదికలో సైన్స్ ప్రచారంలో ఆయన ముందుపీఠిన ఉండేవారు. ప్రకాష్‌నగర్ ప్రాంతంలో పేదల వైద్యునిగా ఆయన పేరుగాంచారు. హనుమంతరావు మృతికి సిపిఎం పట్టణ, రూరల్ కార్యదర్శులు బూరుగ వెంకటేశ్వర్లు, దొంతిరెడ్డి వెంకటరెడ్డి, గాదె సుబ్బారెడ్డి, వేములు దుర్గారావు సంతాపం తెలియజేశారు. హనుమంతరావు అంత్యక్రియలు ఆదివారం ఉదయం పది గంటలకు ప్రకాష్‌నగర్‌లో జరుగుతాయని కుటుంబసభ్యులు తెలిపారు.

చలపతి ఫార్మసీలో విజిలెన్స్ వారోత్సవాలు

ప్రజాశక్తి-గుంటూరు

జాతీయ ఫార్మకో విజిలెన్స్ వారోత్సవాల సందర్భంగా చలపతి ఫార్మసీ కళాశాలలోని ఐపిసి-పివిపిఐ, చలపతి ఏడిఆర్ మానిటరింగ్ సెంటర్ వారు కళాశాలలో ఆన్‌లైన్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేయటానికి నిర్వహించిన ముగింపు కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా కళాశాల విశ్రాంత అధ్యాపకురాలు బి.వరలక్ష్మిహాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా వెలువడిన ఈ ఫార్మకో విజిలెన్స్ ఒక రోగి ప్రతికూల ప్రభావాలను గుర్తించటం, అంచనా వేయటం, అర్థం చేసుకొని నివారించటం ముఖ్యవిధి అని తెలిపారు. ప్రతి ఔషధానికీ ప్రీ మార్కెటింగ్ క్లినికల్ ట్రయల్స్ తర్వాత ఫార్మకో విజిలెన్స్ కార్యకలాపాలు అవసరం అన్నారు. పోస్ట్ మార్కెటింగ్ అధ్యయనంలో ముఖ్యభాగంగా ఉంటుందన్నారు. డ్రగ్ సేఫ్టీ అసెస్‌మెంట్ ద్వారా హానికరమైన ఔషదాలను కనుగొని వాటి భద్రత అంచనా వేస్తారని, వీటిలో ముఖ్యమైదని అడ్వర్స్ డ్రగ్ రియాక్షన్ అని తెలిపారు. దీని ద్వారా ఔషధం తీసుకున్న తర్వాత వచ్చే చర్య, ప్రతిచర్యలను గ్రహించి తదుపరి విధులను నిర్వహించటానికి సహకరిస్తుందని, సేకరించిన నివేదికలను విజిఫ్లో సాఫ్ట్‌వేర్ ద్వారా ఐపిసి-పివిపిఐ ఉప్పల సెంటర్‌కు చేరుస్తారని అన్నారు. ప్రొఫెసర్ నాదెండ్ల రామారావు మాట్లాడారు. అనంతరం విజేతలకు వరలక్ష్మి బహుమతులు అందచేశారు. విజేతలను చలపతి అధినేత వై.వి.ఆంజనేయులు అభినందించారు.

మాట్లాడుతున్న శివాజీ

జిఒ 21 రద్దుకు అక్టోబర్ 6న మహాధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

రవాణా రంగానికి ప్రమాదకరమైన జీవో నెంబర్ 21 రద్దు చేయాలని కోరుతూ అక్టోబర్ 6న విజయవాడలో మహాధర్నాను జయప్రదం చేయాలని గుంటూరు జిల్లా ఆటోడ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నన్నపనేని శివాజీ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక సిఐటియు జిల్లా కార్యాలయంలో బి.లక్ష్మణరావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం జరిగింది. శివాజీ మాట్లాడుతూ మోటారు వాహన చట్ట సవరణలో భాగంగా రాష్ట్రంలో రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 21 తీసుకొచ్చి, డ్రైవర్లను రోడ్లపై వాహనాలు తిప్పడానికి వీలు లేకుండా చిన్న చిన్న ప్రమాదాలకు కూడా 304ఎ కడుతూ జైళ్లకు పంపిస్తున్నటువంటి పరిస్థితి ఉందన్నారు. ప్రభుత్వం వాహనమిత్ర ఇస్తున్నామని ప్రచారం చేసుకుంటూ చిన్నచిన్న తప్పిదాలకు కూడా పెద్ద ఎత్తున ఫైన్లు విధించటం, ఫీజులు పెనాల్టీలు భారీగా పెంచడం ద్వారా పెద్ద ఎత్తున భారాలు మోపుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పెట్రోల్ డీజిల్ గ్యాస్ ధరలను విపరీతంగా పెంచుతూ ఆదాయ వనరుగా రవాణా రంగాన్ని భావించటం అత్యంత దారుణమైన చర్య అన్నారు. మోటారు వాహన చట్ట సవరణకు వ్యతిరేకంగా దేశ వ్యాప్త పిలుపులో భాగంగా, ఆంధ్రప్రదేశ్‌లో జిఒ 21ని వ్యతిరేకిస్తూ జరిగే ధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు షేక్ మస్తాన్ వలి, కోశాధికారి గండికోట శంకర్, సిఐటియు జిల్లా కార్యదర్శి కె శ్రీనివాసరావు, నాయకులు జి.మరయదాసు, కే ఏడుకొండలు, శ్రీనివాసరావు, షంషుద్దీన్, వెంకటేశ్వరరావు, రాజు,పవను తదితరులు పాల్గొన్నారు.

నేడు పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి-గుంటూరు

కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ గుంటూరు, కాపు సేవా సమితి-పొన్నూరు శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నేడు పొన్నూరులోని సాయిదివ్య ఫంక్షన్ హాల్లో పేద విద్యార్థులకు ఉపకార వేతనాలు ఇవ్వనునున్నట్లు ఆయా సంస్థల నిర్వాహకులు తెలిపారు. మొత్తం 120 మంది విద్యార్థులకు రూ.4లక్షల ఉపకార వేతనాలు అందివ్వనున్నట్లు చెప్పారు. ఈమేరకు కాపు సేవాసమితి వారు శనివారం అరండల్‌పేటలోని తులసి భవన్‌లో కృష్ణదేవరాయ ఎయిడ్ ఫర్ పూర్ అండ్ అండర్ ప్రివిలైజ్డ్ ట్రస్టీ తులసి రామచంద్ర ప్రభును కలిసి ఆహ్వానపత్రం అందచేశారు.

ఎన్ఎస్ఎస్‌తో నాయకత్వ లక్షణాలు

ప్రజాశక్తి-గుంటూరు

కొఠారి కమిషన్ సిఫార్సుల మేరకు 1969లో అప్పటి ప్రధాని జవర్‌లాల్ నెహ్రూ ఏర్పాటు చేసిన జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) నేడు లక్షల మంది విద్యార్థులతో, పాఠశాల నుండి యూనివర్సిటీ స్థాయి వరకూ అభివృద్ధి చెంది, సేవలకు మారుపేరుగా నిలుస్తుందని ప్రముఖ విద్యావేత్త, ఉత్తమ అధ్యాపక అవార్డు గ్రహీత చల్లా పద్మావతి పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ జాతీయ దినోత్సవాన్ని శనివారం స్థానిక బ్రాడీపేటలోని గురవయ్య డిగ్రీ కాలేజిలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ ద్వారా విద్యార్థుల్లో సేవాధృక్పదం, నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చెందుతాయని అన్నారు. అనంతరం నీడ్స్ బ్లడ్ బ్యాంక్ చే విద్యార్థులకు బ్లడ్‌గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలేజి కరస్పాండెంట్ మాజేటి వెంకటరామకోటి ముత్యాలు, అధ్యక్షులు రూపచంద్రరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ మంచాల బోసుబాబు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వేణుగోపాలరావు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్త పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది

'ఆయుష్మాన్ భవ'పై అవగాహన

ప్రజాశక్తి-అమరావతి

అమరావతి సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఆయుష్మాన్ భవ కార్యక్రమం పై శనివారం రోగులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్నెంట్ డాక్టర్ చందులాల్ నాయక్ మాట్లాడుతూ రోగులకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేకంగా ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని ప్రవేశపెట్టినదని ఈ అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు,ఆశాలు పాల్గొన్నారు.

కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎంపీపీ చిన్నపరెడ్డి పద్మా వెంకటేశ్వర్ రెడ్డి

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-బెల్లంకొండ

మండలంలోని న్యూ చిట్యాలలో వైసిపి సానుభూతిపరులు షేక్ గాలి సాహెబ్ అనారోగ్యంతో మృతి చెందడంతో వారి కుటుంబ ఖర్చులకు గాను రూ.5,000 ఆర్థిక సహాయాన్ని ఎంపీపీ చెన్నప్ప రెడ్డి పద్మా వెంకటేశ్వర రెడ్డి శనివారం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతు నాయక్, మన్నె సుల్తాన్ పాలెం సర్పంచ్ దారం వెంకటరమణారెడ్డి, మర్రి ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయండి

ప్రజాశక్తి-వినుకొండ

సీఎం జగన్మోహన్ రెడ్డి రాష్ట్రంలో మున్సిపాలిటీలలో పనిచేసే కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తానన్న మాటను నిలబెట్టుకోవాలని కాంట్రాక్టు కార్మికులందరినీ వెంటనే పర్మినెంట్ చేయాలని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం గేటు వద్ద ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్ లో ఆయన అతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా పట్టణంలో పట్టణం పెరి గిన దానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచడం లేదని దానివల్ల కార్మికులపై పనిభారం తీవ్రమైందని పారిశుద్ధ్య కార్మికులు చేస్తున్న పని విధానంలో అనేకమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కాంట్రాక్టు కార్మికులను ఆప్కాబ్ కార్పొరేషన్ లో చేర్చి ప్రభుత్వం ఇచ్చే పథకాలను రాకుండా చేశారని. పెరిగిన జనాభాకు అనుగుణంగా కార్మికులను పెంచాలని కరోనా సమయంలో తీసుకున్న కార్మికులను కొందరిని తొలగించారని వారిని వెంటనే తీసుకోవాలని మొదలైన డిమాండ్లు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం గతంలో కార్మికులకు ఇచ్చిన హామీలని వెంటనే అమలు చేయని పక్షంలో ఈ నెల 27వ తేదీన ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ పోరుబాట పడతామని హెచ్చ రించారు.

బికెఎంయు మహాసభలు జయప్రదం చేయండి

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

గిరిజనులకు,దళితులకు సాగు భూములు ఇవ్వాలని సామాజిక న్యాయం, ఉపాధి సాధన కోసం 25, 26, 27 వ తేదీ వరకు జిల్లా కేంద్రం బాపట్ల పట్టణంలో జరిగే ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం బికెఎంయు 22వ రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ నరసరావుపేట నియోజకవర్గంలో ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవ సాయ కార్మిక సంఘం ఏరియా కార్యదర్శి జమ్ముల వెంక టేశ్వర్లు ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సం ఘం బికెఎంయు 22వ రాష్ట్ర మహాసభల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయమే ప్రధాన వృత్తిగా ఉన్న ఆంధ్ర రాష్ట్రంలో గ్రామీణ ప్రజల్లో అత్యధిక వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారన్నారు. వీరిలో గిరిజనులు, దళితులు, మైనార్టీలు వెనకబడిన కులాల తదితర పేదలు చెమటోడ్చి కష్టించి పనిచేసే శ్రమ దేశ సంపదకు మూలం అవుతుందన్నారు. అయినా దళితులు గిరిజన రైతులు వ్యవసాయ కూలీలు కరువు కోరల్లో కొట్టుమిట్టాడుతూ తరతరాలుగా అణచివేతకు గురవుతున్నారు. న్యాయమైన కూలి రేట్లు ఇవ్వని భూస్వామ్య పెత్తందారి దోపిడీల నుండి విముక్తి కోసం మనిషిని మనిషిగా చూడాలని సాంఘిక న్యాయం కోసం దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నేత పుచ్చలపల్లి సుందరయ్య స్వగ్రామంలో వ్యవసాయ కూలీ సంఘం గా ఆవిర్భవించిందన్నారు. భూస్వామ్య పెత్తందారి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా న్యాయమైన కూలి రేట్లు సాధనకు భూమి కోసం, భుక్తి కోసం పేద ప్రజల విముక్తి కోసం సామాజిక గౌరవం కోసం దున్నేవాడిదే భూమి అనే నినాదంతో నైజాం నవాబు నిరంకుశ పాలనకు భూస్వాములకు వ్యతిరేకంగా గ్రామీణ శ్రమ జీవులను సమీకరించాలని సిపిఐ నేతలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కె.రాంబాలు,పట్టణ కార్యదర్శి వై.వెంకట్, నాయకులు ఏసోబు, ఏలియ్య, వెంకటేశ్వర్లు, నిమ్మయ్య పాల్గొన్నారు.

విద్యార్థినిలతో వైద్యులు, విజ్ఞాన్ విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాల విద్యార్థినిలకు ఆరోగ్యంపై అవగాహన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్న బాలికలు ఆరోగ్యంపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలనే లక్ష్యంతో నరసరావుపేట పార్లమెంట్ సభ్యులు లావు శ్రీకృష్ణ దేవరాయలు ఆదేశాల మేరకు నరసరావుపేట మండలంలోని ఉప్పలపాడు గ్రామ పరిధిలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 7 నుండి 10 వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించారు. కిశోర బాలికలు ఆరోగ్యం పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలు, గర్భాశయ వ్యాధులు, బాల్య వివాహాలు వలన ఏర్పడే అనర్థాలను వివరించారు. యశోద క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ , గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సంయుక్తంగా పాల్గొని క్యాన్సర్ వ్యాధి సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. సమాజంలో మహిళలు ఎక్కువ శాతం రకరకాల క్యాన్సర్ వ్యాధులకు గురవుతున్నారని క్యాన్సర్ వ్యాది పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. శ్రీనివాసరావు ఉపాధ్యాయులు ఏ మధు కుమార్, డి వీరారెడ్డి, రామకష్ణారెడ్డి, విజ్ఞాన్ యూనివర్సిటీ విద్యార్థులు పి వీణా మాధురి, జి వెంకట్, కె భవిష్యశ్రీ, గాయత్రి, పి.ప్రణతి , పావని , జస్వంత్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విశ్రాంత ఆర్జేడీ కన్నుమూత

ప్రజాశక్తి-వినుకొండ

పట్టణానికి చెందిన విశ్రాంత ఆర్జెడి చిలకల ఆశీర్వాద వరప్రసాద్ (72), గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతు శనివారం కన్నుమూశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వివిధ జిల్లాల్లో విద్యాశాఖ అధికారిగా, గుంటూరు ఆర్జెడి, పాఠశాలల విద్యాశాఖ డైరెక్టర్ గా 35 ఏళ్ల విద్యారంగంలో విశిష్ట సేవలు అందించడం జరిగింది. ప్రభుత్వం ఆయన సేవలను గుర్తించి విద్యాశాఖ విద్యా కమిషన్ సభ్యులుగా నియమించారు. గత కొంతకాలంగా నా ఆరోగ్యంతో బాధపడుతూ శనివారం తెల్లవారుజామున ఆయన మరణించారు. ఆయన కాలం మరణానికి చింతిస్తూ పట్టణానికి చెందిన ప్రముఖ న్యాయవాది పీజే లూకా, చాట్ల రామయ్య, ఫిలిప్, సురభి జోసఫ్, చిలకల జాన్ సుందర్ రావు కపారావు పలువురు నివాళులర్పించారు.

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు

ప్రజాశక్తి - పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ది సంస్ద (ఏ.పి.ఎస్.ఎస్.డి.సి) ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్రంలో ఉన్న నిరుద్యోగ సమస్యను రూపుమాపడానికి కషి చేస్తుందని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి అన్నారు. స్థానిక కోటప్పకొండ రోడ్డులోని నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ది సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ చదువుకొని అన్ని అర్హతలు ఉన్నా ఉపాధి అవకాశాలు లేక నిరుత్సాహంలో ఉన్న యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం జాబ్ మేళాలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిరుద్యోగ యువత జాబ్ మేళా లను సద్వినియోగం చేసుకోవాలని అవకాశాలు అందిపుచ్చుకుని జీవితంలో స్థిరపడాలని ఆకాంక్షిస్తున్నట్లు పేర్కొన్నారు.సంస్థ జిల్లా అధికారి కె. సంజీవరావు మాట్లాడుతూ నేటి మెగా జాబ్ మేళా కు 18 కంపెనీలు హాజరు కాగా 270 మంది నిరుద్యోగ యువత హాజరయ్యారని వారిలో 119 మంది ఉద్యోగాలకు ఎంపిక అయ్యారని ఆయా కంపెనీల ప్రతినిధులు అభ్యర్థులకు ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారని పేర్కొన్నారు. నియామక పత్రలు అందుకున్న అభ్యర్థులకు ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి, సంస్థ మరియు ఆయా కంపెనీల ప్రతినిధులు అభినందలు తెలిపారు. సాధించిన ఉద్యోగ ఉపాధి మార్గంలో నైపుణ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమములో అసిస్టెంట్ కలెక్టర్ కల్పన శ్రీ,పుడా ఛైర్మన్ మిట్టపల్లి రమేష్, డిఆర్‌డిఏ పిడి బి.బాలు నాయక్, ఎంప్లోయిమెంట్ జెఈఓ పద్మ , నరసారావుపేట డిఎల్‌డిఓ ఎం. వెంకటరెడ్డి, నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల ఛైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. శ్రీనివాస కుమార్ నిట్ ప్రిన్సిపల్ డాక్టర్ హరికష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

.జాబ్ మేళాలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాసరెడ్డి

తడి,పొడి చెత్త నుండి సంపద

ప్రజాశక్తి-వినుకొండ

మండలంలోని చీకటి గల పాలెం, బంధుగులపాడు గ్రామపంచాయతీలలో స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా స్వచ్ఛ భారత్ మిషన్ మండల కో ఆర్డినేటర్ పి. ప్రభాకర్ రావు ఎస్ డబ్ల్యూ పిసి షెడ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు కొన్ని సూచనలు చేశారు. తడి వ్యర్థాలను అనగా పాడైపోయిన పండ్లు, ఆకుకూరలు, కూరగాయలు, మిగిలిన ఆహార వ్యర్థములు, గుడ్ల పెంకులు మరియు పొడి వ్యర్థాలు అనగా చిత్తు కాగితాలు అన్ని రకాల ప్యాకింగ్ వ్యర్థాలు ప్లాస్టిక్ పగిలిన గాజు మరియు లోహపు వ్యర్థములు ప్రతిరోజూ ఇంట్లో వచ్చే ఘనపదార్థాలలో తడి చెత్తను ఆకుపచ్చ బకెట్లలోను పొడి చెత్తను నీలిరంగు బకెట్లలోను వేసి ఇంటి వద్దకు వచ్చే క్లాప్ మిత్రులకు అందించాలి. తడి చెత్తను మీ ఇంటి వద్దనే ఎరువుగా తయారు చేసుకొని పూల మొక్కలకు లేదా వ్యవసాయ పంట పొలాలకు సమృద్ధి ఎరువుగా ఉపయోగించుకోవచ్చు. పొడి చెత్తను మీ గ్రామ పంచాయతీ వారు రీసైకిలింగ్ చేయు వారికి అమ్మి దాని ద్వారా వచ్చు ఆదాయాన్ని మీ గ్రామ పరిశుభ్రతకు ఖర్చు చేస్తారు మీ గ్రామాన్ని క్లీన్ ఆంధ్ర ప్రదేశ్ లో భాగస్వామిని చేయండి అని ప్రజలకు తెలియ జేశారు. కార్యక్రమంలో సర్పంచ్ విజయలక్ష్మి కోటిరెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఏ. ఈ అశోక్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి బి ఏ కె జిలాని , సచివాలయ సిబ్బంది , క్లాప్ మిత్రలు, సైదయ్య, సైదమ్మ, షెడ్డు మిత్రా సాయిబాబు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారు

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

గురజాల నియోజకవర్గంలో పోలింగ్ బూత్‌లు మార్పు చేయటంలో రెవిన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని గురజాల మాజీ శాసనసభ్యులు యరపతినేని శ్రీనివాసరావు శనివారం ఓ ప్రకటన ద్వార తెలియజేశారు.గురజాల నియోజకవర్గంలో పిన్నెల్లి, జూలకల్లు,పిడుగురాళ్ళ టౌన్,గురజాల టౌన్,మాడుగల ఇంకా కోన్ని గ్రామాల్లో పోలింగ్ బూతుల్ని గత 30సంవత్సరాలుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న పోలింగ్ బూతుల్ని శాసనసభ్యులు కాసు మహేష్ రెడ్డి రికమండ్ చేశాడని రెవిన్యూ అధికారులు వైసిపి వాళ్ళు ఇళ్ళ మధ్యలో ఉన్న సచివాలయాల్లో ఏర్పాటు చేయడం రెవిన్యూ అధికారులు ఏకపక్షంగా వ్యవహరిస్తునట్లు ఉందని అన్నారు.ఆయా బూత్‌ల పరిధిలో ఉన్న ఓటర్ల అభిప్రాయాలు కూడ తీసుకోకుండా కనీసం వాళ్ళు ఇచ్చిన అభ్యంతరాల వినితిపత్రాలు కూడ పరిశీలించకుండా రూలింగ్ పార్టీకి దాసోహం అనట్లు వ్యవహరించడం సరికాదన్నారు.పోలింగ్ బూత్‌లను వాళ్ళ ఇళ్ళ మధ్యలో ఏర్పాటు చేసుకొని వన్‌సైడ్‌గా వ్యవహరించి గెలుపోందాలని వైసిపి నాయకులు అనుకుంటున్నారని వారి ఆటలు సాగనివ్వమని అన్నారు.

ఈ విషయంపై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేస్తామని ఇందుకు సహకరించిన అధికారులును కూడ ఓదిలిపెట్టమని వాళ్ళపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా చర్యలు చేపడతామని దీనిపై జిల్లా కలెక్టర్ స్పందించి గత 30 సంవత్సరాలుగా ఏ ప్రభుత్వ పాఠశాలల్లో పోలింగ్ బూత్‌లు నిర్వహిస్తున్నారో వాటిలో పోలింగ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పిస్తున్న ఏపిసిపిఎస్‌యుఎస్ బృందం

జిపిఎస్ బిల్లును వ్యతిరేకించండి

ప్రజాశక్తి-తెనాలి

అధికారంలోకి వచ్చిన వారంలోగా సీపిఎస్ రద్దుచేసి ఓపిఎస్ అమలు చేస్తామన్న సిఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఇప్పుడు జిపిఎస్ బిల్లును తెచ్చారని, దీనిని అసెంబ్లీలో వ్యతిరేకించాలని కోరుతూ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను ఏపిసిపిఎస్ యుఎస్ బృందం కోరింది. పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసిన ఉద్యోగులు జిపిఎస్‌తో నష్టపోతున్న విధానాన్ని వివరించారు. ఉద్యోగులకు అండగా నిలవాలని కోరుతూ వినతి పత్రం సమర్పించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షులు తిరుమలరెడ్డి, పట్టణప్రధాన కార్యదర్శి కెవివి కిషోర్, ఉద్యోగులు దుర్గాప్రసాద్, కరిముల్లా, రాజు పాల్గొన్నారు.

తెనాలిలో కూత పెట్టనున్న 'వందే భారత్'

మంగళవారం మినహా తెనాలిలో డైలీ హాల్ట్

ప్రజాశక్తి-తెనాలిరూరల్

విజయవాడ చెన్నై మధ్య ప్రయాణించే వందే భారత్ రైలు ఇకపై తెనాలిలో ఆగనుంది. వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా దేశ ప్రధాని మోడీ ఆదివారం మధ్యాహ్నం 12:20 గంటలకు విజయవాడలో ప్రారంభించనున్నారు. మంగళవారం మినహా ప్రతీరోజు మధ్యాహ్నం 3 గంటల 20 నిమిషాలకు విజయవాడలో బయలుదేరి మధ్యాహ్నం 3 గంటల 41 నిమిషాలకు తెనాలి చేరుకుంటుందని, మధ్యాహ్నం 03 గంటల 42 నిమిషాలకు తిరిగి ఒంగోలు, నెల్లూరు, రేణిగుంట మీదుగా చెన్నై చేరుకుంటుందని తెనాలి స్టేషన్ మేనేజర్ టి వేంకట రమణ శనివారం తెలిపారు. వందే భారత్ లాంటి ప్రాముఖ్యత గల ఎక్స్‌ప్రెస్ ట్రైన్ కు తెనాలిలో రెగ్యులర్ స్టాప్ ఇవ్వడం పట్ల ప్రయాణికులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రైలు ప్రారంభ స్వాగతోత్సవం కారణంగా విజయవాడలో ఆదివారం 12:30 గంటలకు బయలుదేరి తెనాలి రైల్వే స్టేషన్ కు మధ్యాహ్నం 01:00 గంటలకు చేరుకుంటుందని దక్షిణ మధ్య రైల్వే విజయవాడ డివిజన్ ప్రకటన విడుదల చేసింది. ప్రయాణికులు గమనించి తెనాలి రైల్వేస్టేషన్ లో ఆదివారం జరగబోయే స్వాగతోత్సవ కార్యక్రమంలో తెనాలి పట్టణ పరిసరప్రాంత ప్రజలు పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సునీతను సత్కరిస్తున్న మండల విద్యాశాఖాధికారులు

కర్తవ్యం నిర్వహణే గుర్తింపునకు మూలం

ప్రజాశక్తి-పెదనందిపాడు రూరల్

కర్తవ్య నిర్వహణే గుర్తింపునకు మూలమని, వృత్తి ధర్మాన్ని పాటించినప్పుడే సమాజంలో గౌరవం లభిస్తుందని పెదనందిపాడు మండల విద్యాశాఖ అధికారులు1-2, బాలసుబ్రమణ్యం . జాకబ్‌లు అన్నారు గతంలో పెదనందిపాడు పాఠశాలలో పని చేసి ప్రస్తుతం వట్టిచెరుకూరు మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయిని సునీత రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా శనివారం సాయంత్రం కొత్తపాలెం పాఠశాలలో ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయిని ఎం సీతా రామమ్మ ఆధ్వర్యంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. అనంతరం సునీత, సురేష్ కుమార్.దంపతులను ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయులు లక్ష్మీకుమారి, జవహర్ రాణి, సునీత, మధుబాబు, చిరంజీవి, రామారావు, అంగన్వాడీ సిబ్బంది భాగ్యరాజు, శివశంకర్ పాల్గొన్నారు.

20 నుంచి వీణా అవార్డ్స్ నాటకోత్సవాలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక రామకృష్ణ కవి కళాక్షేత్రంలో వచ్చే నెల 20 నుంచి 24 వరకూ కళలకాణాచి సంస్థ ఆధ్వర్యంలో వీణా అవార్డ్స్‌కు ఎంపిక చేసిన నాటక ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్షులు, సినీ మాటల రచయిత బుర్రా సాయిమాధవ్ చెప్పారు. స్థానిక సిపిఐ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సాంఘిక, పద్యనాటిక పోటీలకు ఎంపిక చేసిన ప్రదర్శనల వివరాలు వెల్లడించారు. ఐదు రోజుల పాటు నిర్వహించే ప్రదర్శనల్లో ఏడుపద్యనాటకాలు, ఏడు సాంఘిక నాటికలు, నాలుగు ప్రత్యేక నాటకాల ప్రదర్శన ఉంటుందన్నారు. అలాగే ప్రదర్శనల ప్రారంభం రోజునే ఏఆర్ కృష్ణ జాతీయ పురస్కారాన్ని నెమలికంటి తారక రామారావుకు, 24న బుర్రా సుబ్రహ్మణ్యశాస్త్రి జాతీయ రంగస్థల పురస్కారాన్ని పొన్నాల రామ సుబ్బారెడ్డికి అందిస్తామన్నారు. సమావేశంలో సంస్థ కార్యదర్శి చెరుకుమల్లి సింగారావు, గోపరాజు విజయ్, మేరిగ రామలింగేశ్వరరావు, అయినాల మల్లేశ్వరరావు, దేవరపల్లి భవాని, బడుగు మోహనరావు, కొండముది రమేష్, షేక్ అబ్దుల్‌హకీంజాని పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బుర్రా సాయిమాధవ్ తదితరులు

ఇంకుడుగుంతలపై అవగాహన

ప్రజాశక్తి - చేబ్రోలు

హౌసింగ్ డే కార్యక్రమంలో భాగంగా శనివారం జగనన్న కాలనీలను సందర్శించి, ఇంటి నిర్మాణం, ఇంకుడు కుంటలు గురించి లబ్ధిదారులకు మండల పరిషత్ అభివృద్ధి అధికారి బి. బాబురావు అనగాహన కల్పించారు. ఈ విషయాన్ని హౌసింగ్ అసిస్టెంట్ ఇంజనీర్ ఎస్.కె జానీ బాషా తెలిపారు. వేజెండ్లలోని జగనన్న లే అవుట్‌ని బాబురావు సందర్శించి లబి దారులతో మాట్లాడారని, జగనన్న కాలనీలో ఇంటింటికి వెళ్లి ఇంటి నిర్మాణాలు, ఇంకుడు కుంటలను ఎంపిడిఒ పరిశీలించినట్లు చెప్పారు. ఇంకుడుకుంట నిర్మాణము ఆవశ్యకత గురించి లబ్ధిదారులుకు వివరించి అవగాహన కల్పించారని తెలిపారు .ఇళ్ల నిర్మాణం చేసుకునే వారికి ఇంటితో పాటుగా ఇంకుడు కుంట ఇవ్వడం జరుగుతుందని అన్నారు. ఇంకుడు గుంత నిర్మాణ ఖర్చులు కూడా ఇవ్వడం జరుగుతుందని,సాధ్యమైనంత త్వరగా లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని తెలిపారు. కార్య క్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ బి.మల్లికార్జున, వేజెండ్ల పంచాయతీ సెక్రటరీలు సాంబశివరావు, పద్మ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ యోజిత్ పాల్గొన్నారు.

వేజండ్లలో ఆరోగ్య సురక్ష సర్వే పరిశీలన

వేజండ్ల లో శనివారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను క్షేత్రస్థాయిలో ఎం పి డిఒ, బి బాబురావు, తహశీల్దార్ గోపాలకృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆరోగ్య సిబ్బందికి సూచనలు చేశారు.. కార్యక్రమంలో వేజెండ్ల ప్రాథమిక హెల్త్ సెంటర్ డాక్టర్ వేణుగోపాల్, డాక్టర్ బాబురావు ఆశా వర్కర్లు ఏఎన్ఎంలు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది పాల్గొన్నారు

నగదు రహిత లావాదేవీలపై శిక్షణ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

నగదు రహిత లావా దేవీలు ఏ విధముగా చేయాలి , స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంపై మండల ప్రజా పరిషత్‌లో శనివారం ఒక రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణలో అన్ని గ్రామపంచాయితిల కార్యదర్శులు ,డిజిటల్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు. ఎంపిపి షహేలా నర్గీస్ , ఎంపిడిఒడి. అనూరాధ,విస్తరణ అధికారి ఎంఎన్ఎల్ కుమారి పాల్గొన్నారు.

ఎస్సై అభ్యర్థులుగా 515 మందికి అర్హత

ప్రజాశక్తి-గుంటూరు సిటి

గతంలో వర్షం కారణంగా వాయిదా పడిన ఎస్సై అభ్యర్థుల ఎంపికలో భాగంగా శనివారం 915 మంది అభ్యర్థులు దేహదారుఢ్య పరీక్షలకు హాజరయ్యారు. వారిలో 515 మంది అర్హత సాధించారు. ఈ విషయాన్ని గుంటూరు రేంజ్ ఐజి పాల్ రాజు తెలిపారు. నియామక ప్రక్రియలో భాగంగా గుంటూరు రేంజ్ పరిధికి సంబంధించి ఎస్సై ఉద్యోగాల ప్రాథమిక రాత పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులకు గుంటూరు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో దేహదారుఢ్య పరీక్షలు జరిగాయి . ఈ దేహదారుఢ్యా పరీక్షల ను గుంటూరు రేంజ్ ఐ.జి ,తో పాటు మంగళగిరి కమాండెంట్ వై. ఎస్. ఎస్. వి సుబ్బారెడ్డి, అడిషనల్ ఎస్పీ సుప్రజ పర్యవేక్షించారు. సర్టిఫికెట్స్ వెరిఫికేషన్ తర్వాత బయోమెట్రిక్, ఎత్తు, ఛాతి వంటి ఫిజికల్ మెజర్మెంట్ టెస్టుల అనంతరం ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్ లతో పాటు 1600,100 మీటర్ల పరుగు, లాంగ్ జంప్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ లు శ్రీనివాసరావు, చంద్రశేఖర్ రావు , ఆర్ఐలు రాజారావు, రమేష్ కష్ణన్, థామస్ రెడ్డి, రాఘవయ్యా, సి.ఐ లు, ఎస్సైలు బ్రహ్మానాయుడు శ్రీనివాసరావు ఐజి కార్యాలపు సిబ్బంది పాల్గొన్నారు.

సీజన్‌ల వ్యాధుల నుండి ప్రజలకు రక్షణ కల్పించండి

ప్రజాశక్తి-మంగళగిరి: మంగళగిరి లో వివిధ రకాల వ్యాధుల బారిన పడుతున్న ప్రజలకు రక్షణ కల్పించాలని ప్రజా ఆరోగ్య వేదిక రాష్ట్ర గౌరవ అధ్యక్షులు డాక్టర్ కె వి ఎస్ సాయి ప్రసాద్ శనివారం తెలిపారు. ప్రజలు,వాంతులు, జ్వరము, దగ్గు, జలుబు,ఆయాసాలు వంటి వ్యాధులు వస్తున్నాయి. అక్కడక్కడ పసికర్ల వ్యాధులు కూడా ఉన్నాయని తెలిపారు. డెంగీ జ్వరాలు కూడా వస్తున్నాయి.అలాగే కొంత మందికి కాళ్ళు నొప్పులు,కాళ్ళు పట్టెయట్టం కూడా వస్తున్నది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు సూచించారు. ఇటీవల కురిసిన వర్షాలు తర్వాత తాగునీటి రంగు మారి వస్తున్నాయని, కాచి చల్లార్చిన నీరు మాత్రం తాగాలని సూచించారు. మంగళగిరి చుట్టు ప్రక్కల వివిధ రకాల మాంసాహార హోటళ్ళు,తిను బండారాలు విక్రయించే బండ్లు ఉన్నాయని, వీటిపై ప్రభుత్వ అధికారులు తగిన పర్యవేక్షణ చేయాలని కోరారు.

కాచి చల్లార్చిన నీటిని తాగండి

ప్రతి ఒక్కరు కాచి చల్లార్చిన నీటిని తాగాలని రాజీవ్ గృహకల్ప ప్రాంతంలో ఉన్న మార్కండేయ కాలనీ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి ప్రియాంక సూచించారు. మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో కొద్ది రోజులుగా విరేచనాలు, వాంతులు, జ్వరంతో ప్రజలు బాధపడుతున్న నేపథ్యంలో శనివారం తమ సిబ్బం దితో ఇంటింటి సర్వే నిర్వహించారు

'ఆర్పి మృతికి కారణమైన ఉద్యోగులపై చర్యలు తీసుకోండి'

ప్రజాశక్తి-మంగళగిరి

పది రోజుల క్రితం మంగళగిరి పట్టణంలోని ఆర్ పి కె.శ్యామల మెప్మా ఉద్యోగుల వేధింపుల వల్లే మానసికంగా ఆవేదన చెంది మృతి చెందారని అమరావతి రాజధాని ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు ఎం.నాగయ్య అన్నారు. శనివారం మంగళగిరిలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సిఎంఎం నాగేంద్రం వేధింపులకు గురి చేసే వారిని, అసభ్య పదజాలంతో మాట్లాడేవారని డ్వాక్రా గ్రూపుల మహిళలు ఆరోపిస్తున్నారని తెలిపారు. నాగేంద్రం పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఉపయోగం లేకుండా పోయి ఒదని విమర్శించారు. వెంటనే ప్రభుత్వ విచారణ చేపట్టి శ్యామల కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. పది లక్షల రూపాయలు ఆర్థిక సహాయం చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా నాయకులు కె.నవీన్ పాల్గొన్నారు.

విద్యుత్ అదాలత్ లో 14 ఫిర్యాదుల పరిష్కారం

ప్రజాశక్తి-గుంటూరు సిటి

ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ విద్యుత్ కార్పొరేషన్ అధికారులు సంగడిగుంట విద్యుత్ భవన మీటింగ్ హాల్ లో గుంటూరు డివిజన్ పరిధిలోని గుంటూరు పశ్చిమ , తూర్పు నియోజక వర్గాలు, గుంటూరు రూరల్ మండల తోపాటు పెదకాకాని మండలంలోని విద్యుత్ సమస్యలపై వినియోగదారులకు విద్యుత్ అదాలత్ శనివారం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి కన్స్యూమర్ గ్రీవెన్స్ ప్రొడ్యూసెస్ ఫోరం చైర్మన్ విక్టర్ ఇమ్మానుయేల్ , సాంకేతిక సభ్యులు కే. వెంకట కష్ణ సభ్యులు. సునీత పాల్గొన్నారు. విద్యుత్ వినియోగదారుల నుంచి 23 ఫిర్యాదులు రాగా, 14 ఫిర్యాదులను అక్కడికక్కడే పరిష్కరించి, మిగిలిన 9 ఫిర్యాదులను 15 రోజులలో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సదస్సులో విద్యుత్ శాఖ గుంటూరు సర్కిల్ పర్యవేక్షక ఇంజనీరు ఆవుల మురళీకృష్ణ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ తిరుమల శెట్టి శ్రీనివాస్ బాబు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు సిటి

స్థానిక బండ్లమూడి హనుమాయమ్మ బాలికల డిగ్రీ కళాశాలలో విద్యార్థినులకు వ్యాసరచన, వక్తుత్వం, డ్రాయింగ్ పోటీలు శనివారం నిర్వహించారు. పోటీలలో గెలుపొందిన విజేతలకు బహుమతులను కళాశాల యాజమాన్యం అందించారు. అనంతరం విద్యార్థినులు ర్యాలీగా వెళ్లి 'శ్రీ శిరిడి సాయి దీనజన సేవా సమితి' లోని విభిన్న ప్రతిభావంతులకు పండ్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రసిడెంట్. విజయ భాస్కర్, సెక్రటరీ శ్రీధర్, చలమయ్య కాలేజీ ప్రిన్సిపాల్ . శ్రీనివాస రావు కౌశల్య దేవి, ఎ. రాధామాధవి, మాధవపెద్ది గిరిజ,. లక్ష్మీదీప్తి, అధ్యాపకులు సంధ్య, పద్మావతి, పాల్గొన్నారు.

రేపు విద్యుత్ ఉద్యోగుల ప్రాంతీయ సదస్సు

ప్రజాశక్తి-గుంటూరు

విద్యుత్ పిఆర్‌సి వేతన ఒప్పందాన్ని వ్యతిరేకిస్తూ ఎపి విద్యుత్‌ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 25న స్థానిక బ్రాడీపేటలోని గుర్రం జాషువా విజ్ఞాన కేంద్రంలో ఉదయం 10 గంటలకు రాష్ట్ర ప్రాంతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు కమిటీ రాష్ట్ర నాయకులు సి హెచ్.నాగబ్రహ్మాచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగులు, కార్మికులు పెద్ద సంఖ్యలో సదస్సులో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ప్రభుత్వం చేసిన పిఆర్‌సి వేతన ఒప్పదం ఉద్యోగులు, కార్మికులకు తీవ్ర నష్టదాయకం అన్నారు. ఈ రివర్స్ పిఆర్‌సిని వ్యతిరేకిస్తూ స్ట్రగుల్ కమిటీ రెండో దశ పోరాటానికి పిలుపునిచ్చినట్లు చెప్పారు. విద్యుత్ రంగంలోపనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగుల ఆశలపై నీళ్లు చల్లే విధంగా ఈపిఆర్‌సి ఉందన్నారు. సంస్థలో ఏఒక్క ఉద్యోగి కూడా రివర్స్ పిఆర్‌సి పట్ల సంతృప్తిగా లేరని తెలిపారు. తక్షణమే పిఆర్‌సిని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని విద్యుత్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులు, ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొని, ప్రభుత్వానికి నిరసన తెలపాలని కోరారు.

ముట్లూరులో రీసర్వేను పరిశీలించిన జేసీ

ప్రజాశక్తి-గుంటూరు

జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష-ఫేజ్-3 రీసర్వేలో భాగంగా వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరులో జరుగుతున్న భూ హక్కు పత్రాల పంపిణీ కార్యక్రమం పరిశీలించి, జిల్లా సంయు కలెక్టర్ స్వయంగా రైతులకు భూహక్కు పత్రాలు అందజేశారు. అనంతరం ముట్లూరులో జరుగుతున్న భూహద్దుల మధ్య రాళ్లు పాతే కార్యక్రమం పరిశీలించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ జగనన్న శాశ్వత భూహక్కు, భూరక్ష ఫేజ్-2లో భాగంగా గుంటూరు జిల్లాలో 25 గ్రామాలకు సంబంధించి 30,995 రాళ్లతను పంపగా, ఇప్పటి వరకూ 25,380 రాళ్లను పాతాము అని, అదే విధంగా రీసర్వే పూర్తి అయిన గ్రామాలకు సంబంధించి భూహక్కు పత్రలు ఇప్పటి వరకూ 13,132 పట్టాలు అందగా అందులో 8686 భూహక్కు పత్రాలు రైతులకు అందజేసినట్లు చెప్పారు. అలాగే 7,153భూహక్కు పట్టాలు ప్రింట్ రావాల్సి ఉందన్నారు. స్టోన్ ప్లాంటేషన్, భూహక్కు పత్రాలు పంపిణీ కార్యక్రమం పనులు నిర్దేశించిన గడువు ప్రకారం ఈనెల 25వ తేదీలోపు పూర్తిచేయాలని అధికారుల్ని ఆదేశించారు. అనంతరం జేసీ ముట్లూరు సచివాలయాన్ని సందర్శించి, జిల్లా స్థాయిలో ఇచ్చిన ఆదేశాలను క్షేత్ర స్థాయిలో ఏవిధంగా అమలు చేస్తున్నారో సచివాలయ ఉద్యోగుల్ని అడిగి తెలుసుకున్నారు. సచివాలయ పరిసరాలను కూడా శుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.

ఎపి ఐసెట్ కౌన్సెలింగ్ కొత్త షెడ్యూల్

ప్రజాశక్తి-ఎఎన్‌యు :ఎంబీఏ, ఎంసిఏ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి నూతన షెడ్యూల్‌ను స్వల్ప మార్పులతో విడుదల చేశారు. ఐసెట్ లో అర్హత సాధించిన వారు సర్టిఫికేట్‌ల వెరిఫికేషన్‌కు 25వ తేదీ వరకు, వెబ్ ఆప్షన్లకు 26 నుంచి 29వ తేదీ వరకు, మార్పులు చేర్పులు చేసుకు నెందుకు 30వ తేదీ వరకు గడువు పొడిగించారు. అభ్యర్థులకు కళాశాలల్లో సీట్ల కేటాయింపు అక్టోబర్ 3వ తేదీ, క్లాస్ వర్క్ 4వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి.

ఐసెట్ ద్వారా ఏఎన్‌యులో ఏడు కోర్సులకు అడ్మిషన్లు

ఏపీ ఐ సెట్ 2023 ద్వారా ఏడు కోర్సుల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జి. అనిత తెలిపారు. ఎంబీఏ (జనరల్, సెల్ఫ్ ఫైనాన్స్), ఎంబీఏ హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్ (సెల్ఫ్ ఫైనాన్స్ , సెల్ఫ్ సపోర్టింగ్), ఎంబిఎ టూరిజం ట్రావెల్ మేనేజ్మెంట్ (సెల్ఫ్ ఫైనాన్స్) , ఎంబీఏ ఇంటర్నేషనల్ బిజినెస్ స్టడీస్ (సెల్ఫ్ ఫైనాన్స్, సెల్ఫ్ సపోర్టింగ్), ఎంబీఏ మీడియా మేనేజ్మెంట్ (సెల్ఫ్ సపోర్టింగ్), ఎంబీఏ టెక్నాలజీ మేనేజిమెంట్ సెల్ఫ్ సపోర్టింగ్, ఎంసీఏ (రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్) కోర్సుల్లో ప్రవేశాలు ఉంటాయన్నారు. ఎంసిఏ (రెగ్యులర్, సెల్ఫ్ ఫైనాన్స్) ఎంబీఏ అనుబంధ ప్రతి కోర్సులో పూర్తి ఉద్యోగ ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పారు. ఐసెట్ రాసిన విద్యార్థులు ఎంబీఏ కోర్సులను ఎంపిక చేసుకోవాలంటే ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఒక ప్రైమ్ యూనివర్సిటీగా నిలుస్తుందని వివరించారు. ఏఎన్యూలో సీనియర్ ప్రొఫెసర్లతోపాటు అర్హత గల ఫ్యాకల్టీ ఉన్నారని. ఆధునిక తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్, లక్షకు పైగా వాల్యూమ్స్‌తో అతిపెద్ద గ్రంథాలయం, విద్యార్థులకు వేర్వేరుగా వసతి గృహాలు, పోటీ పరీక్షలకు సిద్ధపడే వారికి ప్రత్యేక రీడింగ్ రూములు, సివిల్స్ వంటి సర్వీసెస్ లక్ష్యాలు ఉన్నవారికి యూనివర్సిటీలో ఉచితంగా సివిల్స్ శిక్షణ అందించే ప్రత్యేక సెంటర్, యూజీసీ నెట్ ఉచిత తరగతులు, క్రీడా సదుపాయాలు అన్ని వెరసి ఆహ్లాదకరమైన సువిశాల ప్రాంగణంలో ఎంబీఏ చదువుకునే వీలును యూనివర్సిటీ కల్పిస్తోందని డాక్టర్ అనిత పేర్కొన్నారు.

27న లీడ్ బ్యాంకు వద్ద కౌలు రైతుల ధర్నా

ప్రజాశక్తి-గుంటూరు

సీసీఆర్‌సి కార్డులు పొందిన ప్రతి కౌలు రైతుకూ స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంట రుణాలు ఇవ్వాలని ఈనెల 27న లీడ్ బ్యాంక్ ఆఫీస్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి బైరగాని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శనివారం ధర్నా కరపత్రాన్ని స్తానిక బ్రాడీపేటలోని సంఘ కార్యాయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది జిల్లాలో 36 వేల మంది కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చారని, అయితే వారిలో కేవలం 3వేల మందికి రూ.15 కోట్ల పంట రుణాలు మాత్రమే మంజూరు చేశారన్నారు. భూ యజమాని అంగీకారంతో గుర్తింపు కార్డులు పొందగలిగితే పంట రుణాలు ఇవ్వడానికి బ్యాంకులకు ఎటువంటి అభ్యంతరం ఉండదని, 2019 సంవత్సరంలో కెసిఆర్‌సి చట్టం తెచ్చినప్పుడు ప్రభుత్వం, బ్యాంకులు నమ్మబలికాయని, కానీ తర్వాత రుణాలు ఇవ్వకుండా కౌలు రైతులను మోసం చేస్తున్నాయని ఆయన వాపోయారు. జిల్లాలో లక్ష మందికి పైగా కౌలు రైతులున్నారని, 70శాతం భూమిని కౌలు రైతులు సాగు చేస్తున్నారని, పంట రుణాలు మాత్రం నామమాత్రంగానే ఇస్తున్నారని విమర్శించారు. ఒకవైపు గిట్టుబాటు ధరలు లేక పోవడం, కరువు కాటకాలు సంభవించటం, కౌలు రేట్లు పెరగడం వలన వాస్తవ సాగుదారులైన కౌలు రైతులు బ్రతుకులు చితికి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంట రుణాలు ఇవ్వకపోవడంతో ప్రైవేట్ వడ్డీ వ్యాపారులపై అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకొని అవి తీర్చలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని, ఇటువంటి కౌలు రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి భరోసా కల్పించడం లేదని విమర్శించారు. బ్యాంకులో రుణాలు ఇవ్వడానికి సవాలక్ష సొంత నిబంధనలు విధిస్తున్నారని ఇలాగైతే రైతులు వ్యవసాయం ఎలా చేస్తారని ప్రశ్నించారు. సంఘం జిల్లా అధ్యక్షులు మన్నవ నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ 2019లో కౌలు రైతుల చట్టంలో మార్పులు తెచ్చిన తరువాత బ్యాంకు రుణాలు ఇవ్వడం కూడా తగ్గిపోయిందని, కౌలు రైతుల పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డట్టు అయిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు బొట్ల రామకష్ణ, తాడిపోయిన వెంకటేశ్వరరావు, చుక్క యానాదులు, షేక్ మస్తాన్ వలి, షేక్ ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

విఐటిలో ఘనంగా మూడవ స్నాతకోత్సవం

1611 మంది పట్టభద్రులకు డిగ్రీలు అందజేత

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని అమరావతిలోని విఐటి విశ్వవిద్యాలయం మూడవ స్నాతకోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిలుగా విశ్రాంత జడ్జి డాక్టర్ జస్టిస్ బి శివ శంకర రావు, బెంగుళూరు మైక్రోసాఫ్ట్ డైరెక్టర్ ఆశిష్ శర్మ హాజరయ్యారు. స్నాతకోత్సవంలో 2023 సంవత్స రానికి చెందిన 1611 మంది పట్టభద్రులకు డిగ్రీ పట్టాలను అందజేశారు. వీరిలో 16 మంది బంగారు పతకాలు, 70 మంది ర్యాంకులు సాధించారు. 34మంది పిహెచ్‌డి, 252 మంది ఎంటెక్, బిటెక్ ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ 56, బిటెక్ సిఎస్‌సి డేటా అనలిటిక్స్ 167, నెట్‌వర్కింగ్ సెక్యూరిటీ 208, ఎలక్ట్రోనిక్స్ అండ్ కమ్యూనికేషన్ 119, ఎంబెడెడ్ సిస్టమ్స్ 51, విఎల్‌ఎస్‌ఐ 29, బిబిఎ 29, బిజినెస్ అనలిటిక్స్ 14, ఎంఎస్సీ ఫిజిక్స్5, కెమిస్ట్రీ 27, డేటా సైన్స్ 51 మంది పట్టాలను అతిథుల చేతుల మీదుగా అందు కున్నారు. ఈ సందర్భంగా సభలో గౌరవ అతిథి ఆశిష్ శర్మ మాట్లాడుతూ కష్టపడి అంకిత భావంతో పని చేసే విద్యార్థులు సవాళ్లు, సమస్యలు ఎదురైనా వాటి నుండి తమ విజయాలకు బాటలు వేసుకొని జీవితంలో అభివృద్ధి చెందుతారని, స్నాతకోత్సవం అనేది అంతం కాదని అది నిరంతర అభ్యాసానికి నాంది అని చెప్పారు. విఐటి ఫౌండర్, ఛాన్సలర్ డాక్టర్ జి విశ్వనాథన్ మాట్లాడుతూ విఐటి విశ్వ విద్యాలయంలో స్నాతకోత్సవంలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. విఐటి విశ్వవిద్యాలయం అకడమిక్ ఎక్సలెన్స్‌ను పెంపొందించడం, భవిష్యత్ నాయకులను రూపొందించడంలో అంకితభావం కలిగి ఉందని అన్నారు. ఈ స్నాతకోత్సవంలో 2023 బ్యాచ్ విద్యార్థులు ప్రదర్శించిన కషి, సంకల్పం, స్నాతకోత్సవం నిదర్శనంగా నిలుస్తుందని అన్నారు. కార్యక్ర మంలో విఐటి వైస్ ప్రెసిడెంట్ శంకర్ విశ్వనాథన్, విసి డాక్టర్ ఎస్ వి కోటా రెడ్డి, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, అకడమిక్ డీన్ డాక్టర్ ఎన్ మధుసూధన రావు తదితరులు పాల్గొన్నారు.

ఆనందోత్సాహంలో విద్యార్థులు

పట్టాలు పొందిన విద్యార్థులతో డాక్టర్ శివ శంకరరావు, తదితరులు

ఎన్నికల ఏడాదిలో టిడిపిలో నైరాశ్యం

వీక్షణం

చంద్రబాబు అరెస్టు తదనంతర పరిణామాలతో టిడిపిలో నైరాశ్యం ఏర్పడింది. ప్రధానంగా న్యాయస్థానంలో చంద్రబాబుకు ప్రతికూల తీర్పులు రావడం పార్టీ నేతలకు మింగుడు పడటంలేదు.

గత 30 ఏళ్ల కాలంలో చంద్రబాబు ఎప్పుడూ ఈ స్థాయిలో రాజకీయంగా, న్యాయపరంగా ఇబ్బంది పడిన ఘటనలు లేవని 15రోజులు జైలులో ఉండటం ఇదే తొలిసారి అని టిడిపి నాయకులు చెబుతున్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై వైసిపి ప్రభుత్వం నారా చంద్రబాబునాయుడు, నారా లోకేష్ లక్ష్యంగా కేసులు నమోదు చేయడం పార్టీలో కలకలం రేపింది. ఇప్పటికే చంద్రబాబు నాయుడు అరెస్టు అయి రాజమండ్రి జైలులో ఉన్నారు. తాజాగా నారా లోకేష్‌ను కూడా ఎపి ఫైబర్‌నెట్ కుంభకోణంలో అరెస్టు చేస్తారన్న ప్రచారం పార్టీ శ్రేణులను కలవరపరుస్తోంది. చంద్రబాబు అరెస్టు చేసిన రోజు నుంచి ఇప్పటి వరకు టిడిపి నాయకులు జిల్లా వ్యాప్తంగా నిరసన దీక్షలు కొనసాగిస్తున్నారు. గత వారం రోజులుగా అన్ని నియోజకవర్గాల్లో దీక్షలు, నిరసనలు ఉధృతం చేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొంటున్నా సామాన్య ప్రజలను భారీగా సమీకరించడంలో నాయకులు సఫలీకృతం కాలేకపోతున్నారు. నిరసనల్లో పాల్గొంటున్న వారిపై పోలీసులు డేగ కన్ను వేశారు. పోలీసులు ఎక్కడికక్కడ నిర్బంధం కొనసాగిస్తుండటం వల్ల పరిమిత సంఖ్యలోనే నిరసన దీక్షలు చేయాల్సి వస్తుందని టిడిపి నాయకులు చెబుతున్నారు. ప్రజా సమస్యలపై ఉద్యమాలు నిర్వహించకుండా చంద్రబాబు అరెస్టుపైనే నిరసనలకు పరిమితం కావాల్సి వచ్చిందని టిడిపి నాయకులు వాపోతున్నారు. గతంలో బాదుడే బాదుడు, ఇదేం ఖర్మ, బాబు ష్యూరిటీ, భవిష్యత్తుకు గ్యారంటీ తదితర కార్యక్రమాల ద్వారా ప్రజల్లోకి వెళ్లగలిగారు. కానీ గత 15 రోజులుగా పార్టీ యంత్రాంగం మొత్తం చంద్రబాబు అరెస్టుకు నిరసనగా వివిధ రూపాల్లో నిరసనలకు పరిమితం కావాల్సిన పరిస్థితి ఏర్పడింది. స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో ఆర్థిక లావాదేవీల కుంభకోణం 2017-18లో జరిగితే ఇప్పుడు అరెస్టు చేయడం ఎమిటని టిడిపి వారు ప్రశ్నిస్తున్నారు. చంద్రబాబు అరెస్టుకు నిరసనగా ఏ కార్యక్రమానికి పిలుపునిచ్చినా పార్టీకి చెందిన ప్రధాన నాయకులందరిని ముందే గృహనిర్బంధం చేయడం పరిపాటిగా మారింది. ప్రస్తుతం అగ్రనాయకులను పోలీసులు నియంత్రించినా కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులు నిరసన కార్యక్రమాల్లో ఎక్కడికక్కడ కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. చంద్రబాబు అరెస్టుతో పార్టీలో కొంత ఇబ్బంది కరమైన పరిస్థితులు నెలకొన్నాయి. లోకేష్‌ను కూడా అరెస్టు అయితే పార్టీ సీనియర్ నాయకులు కూడా కొంత ఇబ్బంది పడే అవకాశంఉంది. గతంలో వివిధ పోలీసు స్టేషన్లలో పెండింగ్‌లో ఉన్న ఎన్‌బిడబ్ల్యూ వారెంట్లను అమలు చేయాలని పోలీసు అధికారులు కిందిస్థాయి అధికారులపై వత్తిడి తెస్తున్నారని తెలిసింది. అలాగే గతంలో పలు ఉద్యమాలు,ఆందోళనల్లో పాల్గొన్న టిడిపి నాయకులపై పెండింగ్‌లో ఉన్న కేసుల్లో కూడా అరెస్టు చేయాలని యోచిస్తున్నారని తెలిసింది. దీంతో నియోజకవర్గ ఇన్‌చార్జిలతోపాటు పలువురు ద్వితీయ శ్రేణి నాయకుల దూకుడుకు కళ్లెం వేయాలని పోలీసు యంత్రాంగం యోచిస్తోంది.

(ఎ.వి.డి.శర్మ)